జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి | సోమవారం 21 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 225 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి


Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## నేను మర్యాదగా మాట్లాడే మూడ్‌లో లేను

- జమ్ము సీఎం ఒమర్ అబ్దుల్లా అసహనం
- పరుష పదజాలం ఉపయోగించినందుకు ఎక్స్‌క్యూజ్ చేయాలని,
- జమ్ము నుంచి ఢిల్లీకి బయలుదేరిన విమానం దాదాపు మూడు గంటల పాటు గాల్లోనే చక్కర్లు


2



## ఆయనకు అప్పీల్ చేసుకునే హక్కు లేదు

- 2019 జూన్‌లో ఐసీజే భారత్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తూ జాదవ్‌కు కాన్సులర్ యాక్సెస్ హక్కును కల్పించాలి
- ఈ కేసులో జాదవ్‌కు విధించిన మరణశిక్షను పునఃసమీక్షించాలి
- 2023 మేలో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టుకు నిరసనగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ సైనిక కోర్టులు కొందరిని దోషులుగా నిర్ధారించాయి.

2



## పదో తరగతి విద్యార్థి పాట్లు

- నా ప్రేమ మీ చేతిలో ఉంది..
- మీరు పాస్ చేయకపోతే అంతేసంగతి..
- నన్ను పాస్ చేయకపోతే.. మా అమ్మానాన్న నన్ను కాలేజీకి పంపించరు

2

## తెలుగు ప్రజల అభ్యున్నతికి
# పునరంకితమవుతా

- ధన్యవాదాలంటూ సీఎం చంద్రబాబు ట్వీట్.. ఎందుకంటే..
- మీ అభిమానం, ఆప్యాయతతో నా మనసు ఉప్పొంగింది
- ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన మీ అందరికీ కృతజ్ఞతలు
- 47 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో అండగా ఉన్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు.
- నాలుగోసారి సీఎంగా అవకాశమిచ్చినందుకు మీ అందరికీ రుణపడి ఉంటా.



ప్రజాజ్యోతి అమరావతి

తన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు చెప్పిన అందరికీ ఏపీ సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన అందరికీ ధన్యవాదాలు చెప్పారు. " మీ అభిమానం, ఆప్యాయతతో నా మనసు ఉప్పొంగింది. ఈ ప్రయాణం లో తోడుగా నిలిచిన మీ అందరికీ కృతజ్ఞతలు. 47 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో అండగా ఉన్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. నాలుగోసారి సీఎంగా అవకాశమిచ్చినందుకు మీ అందరికీ రుణపడి ఉంటా. ప్రజల ఆకాంక్షలు సాకారం చేసేందుకు నిరంతరం కష్టపడతా. రాష్ట్రాభివృద్ధికి, తెలుగు ప్రజల అభ్యున్నతికి పునరంకితమవుతా. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం తెలుగువాళ్ల రక్తంలోనే ఉంది. భవిష్యత్తులో మనమంతా తిరుగులేని విజయాలు - మిగతా3లో



## అమెరికాలో భారతీయులకు
# కొత్త టెన్షన్

- సంచలనంగా మారిన నివేదిక!
- అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవే
- ఇక, భారతీయుల దుస్థితి మాత్రం మరింత దారుణంగా ఉంది
- భారతీయుల వీసాలే ఎక్కువ సంఖ్యలో రద్దు అవుతున్నాయి
- అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారు



## జమ్ముకశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

- వరద బీభత్సంతో భయానక వాతావరణం
- రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న కుండపోత వాన
- వర్షాల కారణంగా ఇప్పటి వరకు ముగ్గురు మృతి
- ఎడతెరిపిలేని వర్షాల కారణంగా రాంబన్ జిల్లాలో దాదాపు 40 ఇళ్లు పూర్తిగా ధ్వంసం
- విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం

# మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల




- మంత్రి నారా లోకేష్
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ ఫైలుపైనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేసిన విషయం తెలిసిందే.
- మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల ద్వారా మరో ఎన్నికల హామీని నిలబెట్టుకున్నాం
- 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నోటిఫికేషన్ విడుదల చేశాం
- ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు

ప్రజాజ్యోతి అమరావతి

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నవారికి ఏపీ ప్రభుత్వం పండుగ లాంటి శుభవార్త తెలిపింది. ఏపీ ప్రభుత్వం ఆదివారం ఉదయం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ ఫైలుపైనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఇవాళ చంద్రబాబు 75వ జన్మదినోత్సవం సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులకు ఈ తీపి కబురు చెప్పింది. దానిలో భాగంగా ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మీడియాతో మాట్లాడారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల ద్వారా మరో ఎన్నికల హామీని నిలబెట్టుకున్నామని - మిగతా3లో

## నితీష్‌ది కుర్చీల గోల.. వారిది అవకాశవాద కూటమి

- నితీష్ కుమార్ కేవలం కుర్చీ కోసమే పార్టీలు మారుతుంటారు
- ఈ ఏడాది చివర్లో బీహార్‌లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని అధికారం నుంచి తప్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి
- "నితీష్ కుమార్, బీజేపీ మధ్య పొత్తు అవకాశవాద పొత్తు
- ఇది రాష్ట్ర ప్రజలకు మేలు చేసేది కాదు.
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



## గుజరాత్‌లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ బృందం

- అమరావతి నిర్మాణంలో భాగంగా పలు కట్టడాలు,సిటీల సందర్శన
- అమరావతిలో భారీ విగ్రహాల నిర్మాణాల కోసం వల్లభాయ్ పటేల్ విగ్రహం అధ్యయనం
- అహ్మదాబాద్ లో గిఫ్ట్ సిటీ,సెక్ట్,సబర్మతి రివర్ ఫ్రంట్ పరిశీలన
- మంత్రి వెంట గుజరాత్ పర్యటనకు వెళ్లిన సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు



ప్రజాజ్యోతి అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నారు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ..అమరావతిలో భారీ భవనాల నిర్మాణాల కోసం ముంబయి,ఢిల్లీలో పర్యటించారు...తాజాగా గుజరాత్ లో రెండు రోజుల పర్యటనకు వెళ్లారు మంత్రి నారాయణ... ఈ పర్యటనలో మంత్రి వెంట సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు,అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారధి,గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు ఉన్నారు.మొదటి రోజు ఉదయం అహ్మదాబాద్ చేరుకున్న మంత్రి బృందానికి గుజరాత్ రాష్ట్ర అధికారులు ఘన స్వాగతం పలికారు... అహ్మదాబాద్ నుంచి బస్సులో ఏక్తానగర్ చేరుకున్నారు.. ఏక్తానగర్ లో ప్రపంచంలోనే - మిగతా3లో

# చంద్రబాబు.. ఓ నిత్య విద్యార్థి




- ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు
- ఆయన సమయపాలనతో ఒకరిద్దరికి ఇబ్బంది కలిగినా.. రాష్ట్ర ప్రజలకు భవిష్యత్‌లో ఎంతో మేలు జరుగుతుంది
- చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన ప్రసంగాలకు సంబంధించి, రెండు పుస్తకాలను జయప్రద ఫౌండేషన్ ప్రచురించింది

ప్రజాజ్యోతి అమరావతి

ఏదైనా కొత్త విషయాన్ని చిన్న కుర్రాడు చెప్పినా.. శ్రద్ధగా వింటూ టైమ్ మర్చిపోయి, నిత్య విద్యార్థిగా సీఎం చంద్రబాబు నేర్చుకుంటారని ఉపసభాపతి రఘు రామకృష్ణ రాజు అన్నారు. ఆయన సమయపాలనతో ఒకరిద్దరికి ఇబ్బంది కలిగినా.. రాష్ట్ర ప్రజలకు భవిష్యత్‌లో ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఆయన ఆదర్శ రాజకీయవేత్త అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టిన రోజు సందర్భంగా అసెంబ్లీ కమిటీ హాల్‌లో రెండు పుస్తకాలను రఘురామకృష్ణరాజు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన ప్రసంగాలకు సంబంధించి, రెండు పుస్తకాలను జయప్రద ఫౌండేషన్ ప్రచురించింది. పుస్తకాలను తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్, సీనియర్ పాత్రికేయులు, రచయిత విక్రమ్ పూల రూపొందించారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్ - మిగతా3లో

# ఆయనకు అప్పీల్ చేసుకునే హక్కు లేదు : పాకిస్థాన్

గూఢచర్యానికి పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటూ పాకిస్థాన్ జైల్లో మగ్గుతున్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌కు అనుకూలంగా 2019లో అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో ఓ లొసుగును పాకిస్థాన్ వాడుకుంటోంది. ఆ తీర్పులో అంతర్జాతీయ న్యాయస్థానం సూచించినట్లుగా అతడికి అప్పీల్ చేసుకునే హక్కు ఇవ్వలేదని అంటోంది. 2019 జూన్‌లో ఐసీజే భారత్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తూ జాదవ్‌కు కాన్సులర్ యాక్సెస్ హక్కును కల్పించాలని తేల్చిచెప్పింది. ఈ కేసులో జాదవ్‌కు విధించిన మరణశిక్షను పునఃసమీక్షించాలని పాకిస్థాన్‌ను కోరింది. అప్పటివరకు ఉరిశిక్ష అమలు చేయొద్దని ఆదేశించింది. ఇదిలావుంటే 2023 మేలో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టుకు నిరసనగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ సైనిక కోర్టులు కొందరిని దోషులుగా నిర్ధారించాయి. దీనిని సవాలు చేస్తూ ఆ దేశ సుప్రీంకోర్టులో దాఖలైన కేసుపై ఇటీవల విచారణ జరిగింది. దోషుల తరఫు న్యాయవాది సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదనలు వినిపిస్తూ జాదవ్ కేసు గురించి



ప్రస్తావించారు. గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత పౌరుడు జాదవ్‌కు ఉన్న అప్పీలు హక్కు అల్లర్ల కేసుల్లో దోషులుగా తేలిన పాకిస్థాన్ పౌరులకు ఇవ్వలేదని అన్నారు. దీనిపై పాకిస్తాన్ రక్షణ మంత్రిత్వ శాఖ న్యాయవాది స్పందిస్తూ.. అప్పట్లో దేశ న్యాయవ్యవస్థలో ఉన్న లోపాన్ని గుర్తించి అంతర్జాతీయ న్యాయస్థానం జాదవ్‌కు కాన్సులర్‌తో మాట్లాడేందుకు అనుమతిస్తూ ఆ తీర్పును ఇచ్చిందని తెలిపింది. ఆ తీర్పు తర్వాత వియన్నా ఒప్పందానికి అనుకూలంగా చట్టాల్లో మార్పులు చేసినట్లు వెల్లడించింది. ఇది పునఃసమీక్షకు మాత్రమే అవకాశం కల్పిస్తుందని చెప్పింది. ఇక 2023 అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న పౌరులు ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేసుకునే హక్కును కల్పించే అంశంపై అటార్నీ జనరల్ మన్సూర్ ఉస్మాన్ అవాన్ అధికారులతో చర్చలు జరుపుతున్నారని, దీనికి రెండు రోజుల సమయం ఇవ్వాలని కోరినట్లు కోర్టు పేర్కొంది.

నావికాదళంలో విధులు నిర్వర్తించి కొంత కాలానికి పదవీ విరమణ చేసిన కుల్‌భూషణ్ జాదవ్ ఇరాన్‌లోని చాబహార్‌లో వ్యాపారం చేసేవారు. 2016లో ఇరాన్‌లో పాకిస్థాన్ ఏజెంట్లు ఆయనను అపహరించారు. ఆ తర్వాత బలూచిస్థాన్‌లోకి ఆయనను తీసుకొచ్చి అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. 2017 ఏప్రిల్‌లో గూఢచర్యం ఆరోపణలపై పాకిస్థాన్ మిలిటరీ కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. ఈ అంశంపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్‌లో ఉంటున్న జాదవ్‌ను పాక్ అపహరించిందని ఆరోపించింది. జాదవ్ మరణశిక్షను సవాల్? చేస్తూ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 2019లో దీనిపై దర్యాప్తు చేసిన ఐసీజే.. జాదవ్ భారత అధికారులతో మాట్లాడేందుకు వీలు కల్పించింది.

# జమ్ముకశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. క్లౌడ్ బరస్ట్ కారణంగా కుండపోత వర్షం కురిసింది. రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా భారీగా కొండచరియలు విరిగిపడుతున్నాయి. వర్షాల కారణంగా ఇప్పటి వరకు ముగ్గురు మృతిచెందగా.. సుమారు 100 మందిని సహాయక బృందాలు కాపాడాయి. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వివరాల ప్రకారం.. జమ్ముకశ్మీర్‌లో భారీ వర్షాలు భీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా రాంబన్ జిల్లాలో దాదాపు 40 ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కొండ చరియలు విరిగి పడడంతో ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. బాగ్నా గ్రామంలో ఇల్లు కూలిపోవడంతో ముగ్గురు మరణించారని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాంబన్ కుల్బీర్ సింగ్ ధృవీకరించారు. మృతులను మొహమ్మద్ అకిబ్ (14), మొహమ్మద్ సాకిబ్ (9), మోహన్ సింగ్ (75) గా గుర్తించారు. వీరందరూ బాగ్నా పంచాయతీ నివాసితులు.

మరోవైపు.. చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. సుమారు 100మందిని సహాయక బృందాలు రక్షించినట్లు అధికారులు తెలిపారు. శిథిలాల కింద వాహనాలు చిక్కుకుపోయినట్లు చెబుతున్నారు. పశ్చిమాసియాలోని ప్రత్యేకమైన వాతవరణ పరిస్థితుల వల్లే జమ్మూలో భారీ వర్షాలు, తుఫాను సంభవించిందని వాతావరణ శాఖ తెలిపింది. ఐదేళ్లలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు, బలమై గాలులు వీయడం ఇదే మొదటిసారని పేర్కొంది.



ఇదిలా ఉండగా.. భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. రాంబన్‌లో కొండ చరియలు విరిగిపడడం వల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించిందన్నారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఇక, జిల్లా అంతటా రెండు హోటళ్ళు, అనేక దుకాణాలు, నివాస నిర్మాణాలు దెబ్బతిన్నాయి. రహదారులన్నీ బురదతో నిండిపోయాయి. మహిళలు, పిల్లలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# నితీష్‌ది కుర్చీల గోల.. వారిది అవకాశవాద కూటమి

**బక్సర్:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కేవలం కుర్చీ కోసమే పార్టీలు మారుతుంటారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాష్ట్రంలో జేడీయూ-బీజేపీ కూటమిని 'అవకాశవాద' కూటమిగా పేర్కొన్నారు. బక్సర్‌లోని దాల్‌సాగర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ర్యాలీలో ఖర్గే ఆదివారంనాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది చివర్లో బీహార్‌లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని అధికారం నుంచి తప్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. "నితీష్ కుమార్, బీజేపీ మధ్య పొత్తు అవకాశవాద పొత్తు. ఇది రాష్ట్ర ప్రజలకు మేలు చేసేది కాదు. నితీష్ కుమార్ కేవలం కుర్చీ (సీఎం సీటు)కోసమే పార్టీలు మారుతుంటారు. మహాత్మాగాంధీ హంతకుల ఐడియాలజీ కలిగిన వారితో ఆయన చేతులు కలిపారు" అని ఖర్గే విమర్శించారు. ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాలను ఆయన ప్రస్తావిస్తూ, అభివృద్ధి అంశాలపై కంటే విభజన అంశాలపైనే ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించిందని చెప్పారు. పార్లమెంటు సెషన్‌లో ఎక్కువ సమయం వక్ఫ్



బిల్లుపై చర్చతోనే నడిచిందన్నారు. హిందువులు, ముస్లింల గురించి మాట్లాడి ప్రజలను తప్పుదారి పట్టిస్తే ఓట్లు పడతాయనే అభిప్రాయంతో మోదీ, బీజేపీ నేతలు ఉంటారని, ఇక పనిచేయాల్సిన అవసరం ఏముందని ఖర్గే ప్రశ్నించారు.

**మోదీ ఇస్తామన్న ఆర్థిక ప్యాకేజీ ఏమైంది?**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏడాది క్రితం ఇచ్చిన వాగ్దానం ఏమైందని ఖర్గే నిలదీశారు. "2015 ఆగస్టు 15న బీహార్‌కు రూ.1.25 లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని ప్రధాన మంత్రి ప్రకటించారు. ఆ సంగతేమిటని నితీష్ కుమార్‌ను రాష్ట్ర ప్రజలు నిలదీయాలి. మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ నడుపుతున్నారు" అని ఖర్గే విమర్శించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సభికులకు చూపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమికి ప్రజలు ఓటు వేయాలని కోరుతూ ఖర్గే తన ప్రసంగాన్ని ముగించారు.

**నేషనల్ హెరాల్డ్ కేసుపై..**

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇటీవల ఛార్జిషీటు నమోదు చేయడాన్ని కూడా ఖర్గే ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా టార్గెట్ చేసేందుకే ఇలా చేశారని, తమ నాయకులు వీటికి బెదిరిపోరని, దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ తన ప్రాణాలను అర్పించారని అన్నారు. పేదలకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని, మెరుగైన సమాజం కోసం వారెప్పుడూ ఆలోచించరని, కులం, మతం పేరుతో సమాజాన్ని విడగొట్టాలని చూస్తాయని విమర్శించారు. వక్ఫ్ బిల్లును ఆమోదించడం వెనుక మతపరమైన విభజనలు సృష్టించే కుట్ర ఉందని ఖర్గే ఆరోపించారు.

# అమెరికాలో భారతీయులకు కొత్త టెన్షన్

అగ్రరాజ్యం అమెరికా అంటేనే విదేశీయులకు భయం పుడుతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక, భారతీయుల దుస్థితి మాత్రం మరింత దారుణంగా ఉంది. భారతీయుల వీసాలే ఎక్కువ సంఖ్యలో రద్దు అవుతున్నాయి. అమెరికా ప్రభుత్వం రద్దు చేసిన వీసాల్లో 50 శాతం భారతీయ విద్యార్థులవేనని తేలింది. వీసా రద్దు అంటూ భారతీయులకు మెయిల్స్ వస్తున్నాయి. అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్‌కు అందిన నివేదికల ప్రకారం ప్రభుత్వం రద్దు చేసిన 327 వీసాల్లో 50శాతం భారతీయులు ఉన్నారని.. అయితే వారి వీసా రద్దుకు సరైన కారణాలు పేర్కొనలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటువంటి చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇక, విద్యార్థులు అక్కడే చదువుకున్నారు. చాలా ఏళ్లుగా అమెరికాలోనే ఓపీటీపై ఉద్యోగాలు చేస్తున్నారు. ఓపీటీ అంటే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్. దీని ప్రకారం అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగం చేయవచ్చు. ఇలా ఉద్యోగం చేస్తున్న వారి వీసాలే ఇప్పుడు అమెరికాలో ఎక్కువగా రద్దు అవుతున్నాయి. అయితే, ఈ వీసాల రద్దుకు మాత్రం కారణాలు స్పష్టం చెప్పడం లేదు. ఒక్క మెయిల్‌తో వీసాలను రద్దు చేస్తున్నారు. దీంతో, భారతీయులు గందరగోళం నెలకొంది. నివేదిక ప్రకారం.. వీసాలు రద్దు చేసిన విద్యార్థుల్లో 50శాతం మంది భారత్‌కు చెందినవారు కాగా 14శాతం మంది చైనా దేశీయులు. తర్వాతి స్థానాల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు ఉన్నారు. దీనిపై ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ మాట్లాడుతూ..




డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. ఈ విషయంపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు. ఇక, చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే.

## పాకిస్థాన్‌లో హిందూ మంత్రిపై దాడి.. ప్రజాప్రతినిధులపై దాడులు సరికాదన్న ప్రధాని



పాకిస్థాన్ లోని సింధ్‌కు చెందిన ముస్లిం లీగ్-నవాజ్ శాసనసభ్యుడు, మత వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఖేల్ దాస్ కోహిస్తానీపై దాడి జరిగింది. ఈ విషయంపై పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ప్రజా ప్రతినిధులపై దాడులు ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయంపై తాను కోహిస్తానీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. సింధ్ ముఖ్యమంత్రి సయ్యద్ మురాద్ అలీ షా సైతం ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని, దాడిలో పాల్గొన్న దుండగులను వెంటనే అరెస్టు చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అసలేం జరిగిందంటే.. హిందూ నేత అయిన ఖేల్ దాస్ కోహిస్తానీ పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ శాసనసభ్యుడిగా, మత వ్యవహారాల సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు. సింధ్ రాష్ట్రంలో నిర్మించనున్న నూతన కాలువలకు ఇటీవల ఆయన ప్రణాళికను రూపొందించారు. అయితే దీనివల్ల తమకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ కొందరు వ్యక్తులు ఆయనకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. శనివారం ఆయన సింధ్‌లోని తట్టా జిల్లా గుండా వెళ్తుండగా నిరసనకారులు సమాఖ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన కాన్వాయ్‌పై కర్రలు, టమాటలు, బంగాళాదుంపలతో దాడి చేశారు. అయితే ఈ దాడిలో కోహిస్తానీకి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు.


## నేను మర్యాదగా మాట్లాడే మూడ్‌లో లేను..



**న్యూఢిల్లీ:** బ్లడీ షిట్ షో అంటూ ఢిల్లీ విమానాశ్రయ సేవలపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసహనం వ్యక్తం చేశారు. పరుష పదజాలం ఉపయోగించినందుకు ఎక్స్‌క్యూజ్ చేయాలని, ప్రస్తుతం మర్యాదగా మాట్లాడే మూడ్‌లో లేనంటూ తనకు కలిగిన అసౌకర్యంపై ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇంతకూ ఏం జరిగిందంటే.. శనివారం రాత్రి సీఎం ఒమర్ అబ్దుల్లా ఇండిగో విమానంలో జమ్ము నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ఈ క్రమంలో ఢిల్లీలో వాతావరణం అనుకూలించకపోవడం, విమానాశ్రయంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆ విమానాన్ని దారిమళ్లించారు. మూడు గంటల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టిన విమానం.. రాత్రి ఒంటి గంట సమయంలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో దిగింది. మరో రెండు గంటల తర్వాత అంటే ఆదివారం తెల్లవారుజామున 3 గంటల తర్వాత ఢిల్లీకి చేరుకున్నారు. అయితే విమానం ఆలస్యం కావడంపై ఒమర్ అబ్దుల్లా ఫైర్ అయ్యారు. ఢిల్లీ విమానాశ్రయం బ్లడీ షిట్ అంటూ పరుష పదజాలంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. జమ్ము నుంచి ఢిల్లీకి బయలుదేరిన విమానం దాదాపు మూడు గంటల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఢిల్లీ విమానాశ్రయంలో దిగాల్సిన విమానం.. జైపూర్‌లో ల్యాండ్ అయింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నేను విమానం మెట్లపై నిలుచుని మాట్లాడుతున్నా. స్వచ్ఛమైన గాలిని పొందుతున్నా. ఇక్కడి నుంచి ఎప్పుడు బయలుదేరుతామో నాకు తెలియదు. అంటూ ట్వీట్ చేశారు. తెల్లవారుజామున 3 గంటల తర్వాత ఢిల్లీకి చేరుకున్నట్లు మరోసారి ఎక్స్‌లో పోస్టుచేశారు. కాగా, గత వారం రోజులుగా ఢిల్లీలో వాతావరణం అనుకూలించకపోవడంతో ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమాన సర్వీసులను దారిమళ్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతికూల వాతావరణం కారణంగా సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయంటూ ఢిల్లీ విమానాశ్రయం ఆదివారం ఉదయం ప్రయాణికులకు ఓ సలహా జారీ చేసింది. సర్వీసుల షెడ్యూల్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించింది.

## పదో తరగతి విద్యార్థి పాట్లు

**బెంగళూరు:** పరీక్షల్లో పాసయ్యేందుకు విద్యార్థులు నానా తంటాలు పడుతుంటారు. కొందరు శ్రద్ధగా చదివి ఉత్తీర్ణులవుతారు. మరికొందరు ఏమీ చదవకుండానే పరీక్ష హాల్‌కు వెళ్లి.. సినిమా స్టోరీలు, ప్రేమ కథలు, తోచిందేదో రాసి ఆన్సర్ షీట్లను నింపేస్తారు. బరువు చూసైనా పాస్ మార్కులు



వేస్తారేమోనని!. ఇక మరికొందరైతే తమది ఖాళీ బుర్ర.. ఎలాగైనా ఈ గండం నుంచి బయట పడేయాలని, మీకు ఎప్పుడూ రుణపడి ఉంటానని పరీక్ష పేపర్లు దిద్దేవారిని వేడుకుంటారు. ఇంకొందరైతే ఆన్సర్ షీట్లలో డబ్బులు పెట్టి.. తమను పాస్ చేయాలని బతిమిలాడుతూ ఉంటారు. అయితే ఇక్కడ ఓ విద్యార్థి మాత్రం.. తన ప్రేమ భవితవ్యం మీ చేతిలోనే ఉంది.. పరీక్షలో పాస్ చేసి నా లవ్‌ను గెలిపించండి అంటూ పరీక్ష పేపర్‌లో రాసి బతిలాడుకున్నాడు. ఈ ఘటన కర్ణాటకలోని బెళగావి జిల్లా చిక్కోడిలో జరిగింది. కర్ణాటకలో ఇటీవలే సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ అదేనండి పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఉపాధ్యాయులు పేపర్లు దిద్దుతున్నారు. ఈ క్రమంలో ఓ ఆన్సర్ షీట్ దిద్దుతుండగా.. రూ.500 నోటు కనిపించింది. అందులో దయచేసి నన్ను పాస్ చేయండి. నా ప్రేమ ఇప్పుడు మీ చేతుల్లో ఉంది. నేను పరీక్షలో పాస్ అయితేనే.. ప్రేమలో కూడా పాస్ అవుతాను. మీరు నన్ను పాస్ చేస్తే డబ్బులు ఇస్తాను. నన్ను పాస్ చేయకపోతే.. మా అమ్మానాన్న నన్ను కాలేజీకి పంపించరు అని విద్యార్థి అని రాసుకొచ్చాడు. అది చూసిన టీచర్ ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై స్పందిస్తున్న నెటిజన్లు ' పిల్లాడికి ఎంత కష్టం వచ్చింది'..' పాస్ చేసేయండి సార్.. పాస్ చేసేయండి'.. ' ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఆ విద్యార్థితో పాటు చాలా మంది కూడా ఆన్సర్ షీటులో డబ్బులు పెట్టి.. పాస్ చేయమంటూ బతిమలాడటం గమనార్హం.

# గుజరాత్‌లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ బృందం

-మొదటిపేజీ తరువాయి

అతిపెద్దదైన సర్ధార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని పరిశీలించారు...597 అడుగుల ఎత్తుతో ప్రపంచంలోనే అతి భారీ విగ్రహం నిర్మాణం ఏ విధంగా జరిగింది...ఎలాంటి సాంకేతికత ఉపయోగించారు...విగ్రహం తయారీలో ఎలాంటి నిర్మాణ సామాగ్రి ఉపయోగించారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు...ఆ తర్వాత స్థానిక అధికారులతో పాటు పటేల్ విగ్రహ నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి సమాచారాన్ని మంత్రి బృందానికి వివరించారు...నర్మదా నది ఒడ్డున ఉన్న ఈ విగ్రహం నిర్మాణం అధ్యయనం ద్వారా అమరావతిలో నిర్మించదలచిన పలు విగ్రహాలపై ఒక స్పష్టత వస్తుందని భావిస్తున్నారు..అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం తో పాటు మరికొంతమంది ప్రముఖుల భారీ విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది...దాంట్లో భాగంగానే వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించింది మంత్రి బృందం...విగ్రహం పరిశీలనతో పాటు దానికి అనుగుణంగా నిర్మించిన మరిన్ని కట్టడాలను మంత్రి బృందం పరిశీలించింది. ఆ తర్వాత మధ్యాహ్నం ఏక్తానగర్ నుంచి అహ్మదాబాద్ శివారులోని గాంధీనగర్ జిల్లాలో ఉన్న గిఫ్ట్ సిటీని మంత్రి బృందం సందర్శించింది...దేశంలోనే మొదటి ఇంటర్నేషనల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సెంటర్ గా గిఫ్ట్ సిటీ ఉంది.మొత్తం 866 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గిఫ్ట్ సిటీలో ప్రత్యేక ఆర్ధిక మండలి(సెజ్)తో పాటు అనేక సంస్థలు, కంపెనీలు,బ్యాంకలు,ఫిన్ టెక్ సంస్థలు ఉన్నాయి..గిఫ్ట్ సిటీని నేషనల్ హైవేస్ తో పాటు రైల్వే,మెట్రో రైల్వే లైన్ లకు కనెక్ట్ చేసారు...గిఫ్ట్ సిటీకి సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు అక్కడ కార్యకలాపాల గురించి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా గుజరాత్ అధికారులు వివరించారు...గిఫ్ట్ సిటీలో ఉన్న ఆటోమేటెడ్ చెత్త సేకరణ విధానం,5.5 కిలోమీటర్ల పొడవుతో 8 సర్వీస్ లకు సంబంధించిన పైపులు వెళ్లే యుటిలిటీ టన్నెల్ ను మంత్రి బృందం పరిశీలించింది.



గిఫ్ట్ సిటీ సందర్శన తర్వాత మంత్రి నారాయణ బృందం అహ్మదాబాద్ లోని యూనివర్శిటీని సందర్శించింది..ఈ యూనివర్శిటీ సహజ మరియు అభివృద్ధి చెందిన పర్యావరణం,సంబంధిత విభాగాలలో వివిధ కోర్సులను అందిస్తోంది..రాజధానిలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన అంశాలపై యూనివర్శిటీ అధికారులతో మంత్రి బృందం చర్చించింది..ఇప్పటికే అమరావతిని బ్లూ - గ్రీన్ సిటీగా నిర్మించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించింది ప్రభుత్వం...మాస్టర్ ప్లాన్ కు తగిన విధంగా తీసుకోవలసిన చర్యలపై చర్చించారు... మొదటి రోజు చివర్లో మంత్రి నారాయణ బృందం సబర్మతి రివర్ ఫ్రంట్ ను సందర్శించింది...అహ్మదాబాద్ లోని సబర్మతి నది ఒడ్డున అభివృద్ధి చేసిన ప్రాంతాన్ని రివర్ ఫ్రంట్ గా పిలుస్తారు.సబర్మతి నదీ తీర ప్రాంతం అభివృద్ధి కోసం గుజరాత్ ప్రభుత్వం ప్రత్యేకంగా సబర్మతి రివర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ను కూడా ఏర్పాటుచేసింది.నదీ తీరాన్ని రక్షించడంతో పాటు పర్యావరణ హితంగా ఉండేలా ,ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఎంతో అద్భుతంగా రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేసింది.అమరావతి కూడా కృష్ణా నది ఒడ్డున నిర్మిస్తుండటంతో,రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించారు..దీనికోసం సబర్మతి రివర్ ఫ్రంట్ ను ఏవిధంగా అభివృద్ధి చేసారనే దానిపై అధ్యయనం చేసారు..ముందుగా సబర్మతి రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులు రివర్ ఫ్రంట్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మొదటి రోజు పర్యటన ముగిసిన తర్వాత అహ్మదాబాద్ లోనే రాత్రికి బస చేసారు మంత్రి నారాయణ,అధికారులు..రేపు(సోమవారం)ఉదయం స్పోర్ట్స్ సిటీని సందర్శిస్తారు...స్పోర్ట్స్ సిటీ సందర్శనలో భాగంగా నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియంను మంత్రి బృందం సందర్శించనుంది.

# తెలుగు ప్రజల అభ్యున్నతికి పునరంకితమవుతా

-మొదటిపేజీ తరువాయి


సాధించాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదినం ఈ రోజు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే కాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీడీపీ శ్రేణులు, ఆయన అభిమానులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు సైతం వారు చేపట్టారు. ఈ నేపథ్యంలో యూరప్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు.. తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు, ప్రముఖులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు చూపిన అభిమానం, ఆప్యాయతతో మనసు ఉప్పొంగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగుజాతి అభ్యున్నతికి పునరంకితం అవుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోనే శక్తిమంతంగా తెలుగుజాతి ఉండాలన్నది తన అభిమతమని ఆయన ఆకాంక్షించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "నా పుట్టినరోజున మీరు అందించిన శుభాకాంక్షలు, మీరు చూపించిన అభిమానం, ఆప్యాయతతో నా మనసు ఉప్పొంగింది. ఇప్పటి వరకు నా ప్రయాణంలో నాకు తోడుగా నిలిచినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు. 75 ఏళ్ల నా జీవన ప్రయాణంలో,47 ఏళ్ల నా రాజకీయ ప్రస్థానంలో నాకు ఎల్లప్పుడూ తోడునీడగా ఉండి,నన్ను ముందుకు నడిపించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. ప్రజాసేవ చేసేందుకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చిన తెలుగు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.ఇది ఎవరికీ



దక్కని అరుదైన గౌరవం అపురూప అవకాశం. మీ ఆదరాభిమానాలు, నాపై మీరు ఉంచిన నమ్మకం నాలో బాధ్యతను, నిబద్ధతను మరింత పెంచాయి. తెలుగు సమాజ పురోగతి కోసం అలుపు లేకుండా పని చేసేలా మీరంతా నాలో ఉత్సాహం నింపారు. మీ భవిష్యత్ కలలు, ఆకాంక్షలను సాకారం చేయాడానికి నిరంతరం కష్టపడి పని చేస్తానని మాటిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి కోసం, తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం పునరంకితమవుతానని నా జన్మదినం రోజున వినమ్రంగా తెలియజేస్తున్నాను. స్వర్ణాంధ్ర-2047 విజన్ మీ అందరి ఆకాంక్షల సమాహారం.మీ మద్దతుతో,మీ సహకారంతో,సమిష్టి కృషితో ఆ కలను నిజం చేస్తాను. నా ప్రతీ అడుగు, నా ప్రతీ ఆలోచన, ప్రతీ కార్యక్రమం మీ ఉజ్వల భవిష్యత్తు కోసమే.అందరికీ అవకాశాలు కల్పించేలా,ప్రతి పౌరుడి భవిష్యత్తుకు భరోసా నిచ్చేలా పాలన అందిస్తాను.ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ ఆవిష్కరణలకు , అవకాశాలకు కేంద్రంగా మలచాలనేది నా తపన.'థింక్ గ్లోబల్లీ- యాక్ట్ గ్లోబల్లీ' విధానంతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దుకుందాం. సమాజంలో అసమానతలు పోవాలి. పేద-ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గాలి. పేదరికం లేని సమాజం స్థాపించాలనేదే నా సంకల్పం. అందుకే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.. మూడు దశాబ్దాల నాడు నేను ప్రవేశపెట్టిన 'జన్మభూమి' సమాజంలో ఎంతో మార్పు తెచ్చింది. ఈసారి తీసుకువచ్చిన 'పీ4'తో రాష్ట్రంలో పేద కుటుంబాలను... స్వర్ణ కుటుంబాలుగా చేయాలనేది నా ప్రయత్నం. ప్రతి సంపన్న వ్యక్తి పేదవాడి శ్రేయస్సు కోసం పాటుపడాలి. వ్యక్తి శ్రేయస్సే... సమాజ శ్రేయస్సుగా నేను విశ్వసిస్తాను. జనం మన బలం... జనాభా సమర్ధ నిర్వహణ ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించవచ్చు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు సాధిస్తున్న విజయాలు మనకెంతో గర్వకారణంగా నిలుస్తున్నాయి. అత్యధిక తలసరి ఆదాయం ఆర్జిస్తున్నవారిలో ముందువరుసన ఉన్నాం. మనం కలిసికట్టుగా పని చేస్తే మరిన్ని తిరుగులేని విజయాలు సాధించగలం. 2047 నాటికి ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా తెలుగు జాతిని నిలపాలన్నదే నా అభిలాష. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం తెలుగు ప్రజల రక్తంలోనే ఉంది. దేశభక్తి చాటేలా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు చేయి చేయి కలుపుదాం. నాతో పాటు, అందరూ ఇందులో భాగస్వాములు అయ్యేలా ఆహ్వానిస్తున్నాను. నా పుట్టినరోజు సందర్భంగా మారుమూల పల్లె నుంచి దేశ,విదేశాల వరకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు, ప్రజలకు....అందరికీ మరోసారి ధన్యవాదాలు" అంటూ ట్వీట్ చేశారు.

# తిరుమల గోశాలలో ఏం జరుగుతోంది

**తిరుమల :** తిరుపతి శ్రీ వెంకటేశ్వర గో సమ్రక్షణశాల చుట్టూ రాజకీయ వివాదం రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. వైసీపీ నాయకుడు, మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి..గత 3నెలల్లో టీటీడీ గోశాలలో 100కు పైగా గోవులు చనిపోయాయని ఆరోపించడంతో ఈ వివాదం మొదలైంది. అయితే గోవుల మరణాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్యం కారణమని సంచలన వ్యాఖ్యలు చేశారు.గోశాల నిర్వహణలో లోపాలు, గోవులకు సరైన ఆహారం, వైద్య సంరక్షణ లేకపోవడం వల్లే ఈ మరణాలు సంభవించాయని భూమన ఆరోపించారు. అంతేకాక, గోశాల నిర్వహణ బాధ్యతలు అనుభవంలేని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌కు అప్పగించారని విమర్శించారు. అయితే భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించిన టీటీడీ వాటిని తోసిపుచ్చింది.గోశాలలో 100 గోవులు చనిపోయాయనే వాదనలను ఫేక్ న్యూస్ గా అభివర్ణించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చనిపోయిన గోవుల ఫొటోలు టీటీడీ గోశాలకు సంబంధించినవి కావని స్పష్టం చేసింది. అసలు భూమన ఈ విషయం ఎందుకు బయటకు చెప్పారనే దానిపై బీఆర్ నాయుడు వివరిస్తూ సస్పెండ్ అయిన మాజీ గోశాల అధికారి హరినాథ్ రెడ్డి ఇచ్చిన తప్పుడు సమాచారాన్ని భూమన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఈ వివాదం నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి గోశాలను సందర్శించి, గోవులకు సరైన ఆహారం, వైద్య సదుపాయాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. గత మూడు నెలల్లో 40-43 గోవులు వృద్ధాప్యం, వ్యాధుల కారణంగా మరణించాయని..ఇది సహజమైనదని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.అయితే ఈవో చెప్పిన గోవుల సంఖ్యపై భూమన మరోసారి సందేహం వ్యక్తం చేస్తూ టీటీడీ అధికారులు, ఛైర్మన్, సీఎం చంద్రబాబు ఇచ్చిన సమాచారం వైరుధ్యంగా ఉందని విమర్శించారు. దీనిపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మరోసారి స్ట్రాంక్ కౌంటర్ ఇచ్చారు. ఆనాటి ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భూమన కూటమి ప్రభుత్వంపై బురదచల్లే కార్యక్రమం చేస్తున్నాడని మండిపడ్డారు.అసలు హరినాథ్ రెడ్డి అన్నింటికి తెగించి భూమనకు సమాచారం ఇవ్వడం, దాన్ని వైసీపీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ చేయడంతో విస్తృతంగా ప్రచారం చేయడం వెనుక అనేక ఆసక్తికరమైన విషయాలు దాగున్నాయట. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకాగానే టీటీడీని సమూళంగా ప్రక్షాళన చేయాలని భావించి వెంటనే చర్యలు చేపట్టింది.అందులో భాగంగా శ్రీవారి గోశాలపై విజిలెన్స్ విచారణ జరిపించింది. దీంతో నివేదిక బయటకు వచ్చింది. టీటీడీలో జరిగిన అక్రమాలను వెలికి తీయడంతో పాటు భవిష్యత్ లో అలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా విజిలెన్స్ నివేదిక బయటకు రాబోతుందని తెలిసిన వెంటనే వైసీపీ నేతలు ముందుగా గోశాలపై ఆరోపణలు చేయడం



ప్రారంభించారంట. 100 ఆవులు చనిపోయినట్లు ప్రచారానికి తెరతీశారు. వైసీపీ సోషల్ మీడియా మొత్తం ఇలాంటి పోస్టులతోనే నిండిపోయిందట. గత ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన దారుణాలు ఎక్కడ బయట పడతాయో అన్న భయంతో ముందుగానే రోడ్డెక్కి నిందలు వేస్తున్న వైసీపీ నేతల ప్రయత్నాల్లో భాగంగానే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కూటమి సర్కార్ పై లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నాడని తెలుగు తమ్ముళ్లు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ నేరాలు ఘోరాలు జరిగాయని?అవన్నీ కూటమి సర్కార్ పై రుద్దే ప్రయత్నం భూమన చేస్తున్నాడని మండిపడుతున్నారంట. వైసీపీ హయాంలో చాలా చోట్ల గోవులు లేకుండానే దాణా కొనుగోలు అంటూ భారీ అవినీతి చేసినట్లు విజిలెన్స్ నివేదికలో బయటపడిందట. అంతేకాదు గోవులకు నాసిరకం దాణా, కాలం చెల్లిన మందులు ఇచ్చి నోరులేని మూగజీవాల ప్రాణాలను బలిగొన్నట్లు రిపోర్టులో ఉందట. ఇవన్నీ ఎక్కడ బయటపడి తమ మెడకు చుట్టుకుంటాయో అన్న అనుమానంతోనే భూమన ఫేక్ ఫోటోలతో టీటీడీ ప్రతిష్టే కాదు..కూటమి సర్కార్ పై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని అంతా టాక్ విన్పిస్తోంది. మరి గోశాల వివాదం ఇంతటితో ఆగిపోతుందా..మరిన్ని మలుపులు తిరుగుతుందా అనేది చూడాలి.

## మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

-మొదటిపేజీ తరువాయి

మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నోటిఫికేషన్ విడుదల చేశామని ప్రకటించారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సుమారు 13,192 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్జీటీ , స్కూల్ అసిస్టెంట్‌తో పాటు 52 ప్రిన్సిపాల్, 273 పీజీటీ, 1718 టీజీటీ పోస్టులను రాష్ట్ర, జోన్ స్థాయి కోటాలో భర్తీ చేయనున్నాట్లు ప్రకటించారు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలంటే...

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అన్ని వివరాలు cse.ap.gov.in, apdsc.apcfss.in లో పొందుపరిచామని చెప్పారు. అప్లై చేసుకోవాలని భావించే అభ్యర్థులు ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు సీబీటీ విధానంలో ఈ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. మెగా డీఎస్సీ -2025 పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం, ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, పరీక్షా షెడ్యూలు, సిలబస్, నోటిఫికేషన్, హెల్ప్‌డెస్క్ వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని లోకేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులందరికీ మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ సజావుగా సాగడానికి మంత్రి నారా లోకేష్ వీడియో విడుదల చేశారు.

## చంద్రబాబు.. ఓ నిత్య విద్యార్థి

-మొదటిపేజీ తరువాయి

సారథి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ ప్రసంగాలు' పేరుతో రెండు సంపుటాలు ప్రచురించారు. 1995-2003, 2004-2014 మధ్య చంద్రబాబు ప్రసంగాలను సంపుటాలుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి అచ్చెన్నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రోజాకు జనసేన వార్నింగ్

**తిరుపతి :** తిరుమల గోశాల వివాదం రచ్చ రచ్చ అవుతోంది. గోవుల మరణాలపై వైసీపీ వర్సెస్ టీడీపీ యుద్ధమే జరుగుతోంది. భూమనకు మద్దతుగా గురువారం రోజా ఎంట్రీ ఇచ్చారు. అయితే, టీటీడీనో, టీడీపీనో విమర్శించకుండా పవన్ కల్యాణ్‌పైనే ఎక్కువగా అటాక్ చేస్తూ మైండ్ గేమ్ ఆడారు ఆర్కే రోజా. సనాతన ధర్మాన్ని కాపాడుతానని చెబుతున్న పవన్ కల్యాణే.. టీటీడీ అరాచకాలు, గోవుల మృతిపై సమాధానం చెప్పాలని నిలదీశారు. తిరుమల వెంకన్నతో పెట్టుకుంటే ఎవరికీ పుట్టగతులు ఉండవని.. పవన్‌కు కూడా ఇటీవలే ఈ విషయం అనుభవంలోకి వచ్చిందంటూ.. పరోక్షంగా మార్క్ శంకర్ ఘటనను ప్రస్తావిస్తూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు.తమ సేనానిని రోజా అన్నేసి మాటలు అంటుంటే జనసైనికులు ఊరుకుంటారా? ఆ పార్టీ సీనియర్ లీడర్ బొలిశెట్టి సత్యనారాయణ, జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌లు రంగంలోకి దిగారు. రోజాకు అర్థమయ్యే భాషలోనే ఘాటైన విమర్శలు చేశారు. గోశాల ఘటనపై భూమన కరుణాకర్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు.కరుణాకర్‌రెడ్డి హారతి డ్రామా ఆడారని.. ఇప్పుడు గోవుల డ్రామా ఆడుతున్నారని జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. భూమాన వలన తిరుమల ప్రతిష్ఠ దిగజారిందన్నారు. గోశాలకు వెళ్లనివ్వడం లేదని కరుణాకర్ రెడ్డి అనడం పచ్చి అబద్ధమన్నారు. ఇక, రోజాను మాటలతో చెడుగుడు ఆడుకున్నారు బొలిశెట్టి. ఆర్కే రోజా.. ఆడా, మగా, హిజ్రా కూడా కాని.. నాల్గవ జాతికి చెందిన వ్యక్తి అంటూ ఫైర్ అయ్యారు. రోజా గతంలో దర్శనం టికెట్లు బ్లాక్‌లో అమ్ముకొని కోట్లు గడించారని విమర్శించారు. ఇప్పుడా దందా ఆగిపోవడంతో.. తిరుమలపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జనసేన విశాఖ కార్పొరేటర్, ఫైర్ బ్రాండ్ లీడర్.. మూర్తియాదవ్ మరింత రెచ్చిపోయారు. టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల కొండపై అన్యమత ప్రచారానికి ఒడిగట్టారని విమర్శించారు. ఇప్పుడు గోశాల వివాదం తీసుకువచ్చి తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.రోజా.. చిత్తూరు చిత్రాంగి అని.. ఐరన్ లెగ్ లేడీ అంటూ మండిపడ్డారు మూర్తి యాదవ్. రోజా తన ఐరన్ లెగ్‌తో వైజాగ్ ఋషికొండ ప్యాలెస్‌కు గృహ ప్రవేశం చేశారని.. అది ఇప్పటికీ అలాగే ఉండిపోయిందని ఎద్దేవా చేశారు. నగరి ప్రజలు రోజా నడ్డి విరిచిన ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. రోజా ఆ చిత్రాలలో నటించలేదని తిరుమలలో ప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు మూర్తి యాదవ్.టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ వైజాగ్ వాడు అంటూ చులకన చేసి మాట్లాడారని రోజాను తప్పుబట్టారు. వారం రోజులలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కు బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. రోజా సారీ చెప్పకపోతే.. ఆమెను వైజాగ్‌లో అడుగుపెట్టనివ్వమని సవాల్ చేశారు మూర్తి యాదవ్.

## అమాత్య... యోగం ఎప్పుడు

**విజయవాడ :** జనసేన నేత నాగబాబుకు మంత్రి పదవి అందనంత దూరంలోనే ఉంది. ఆయనకు అస్సలు మంత్రి పదవి వస్తుందా? రాదా? అన్నది అనుమానం ఇప్పుడు అందరిలోనూ బయలుదేరింది.



ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయనకు మంత్రి పదవి వస్తుందని, పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని పవన్ కల్యాణ్ బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారెవరైనా సరే పదవులు వస్తాయని పవన్ అన్నారు. పవన్ కల్యాణ్ చెప్పిన దాని ప్రకారం ఉగాది నాటికే నాగబాబు మంత్రి పదవి లభిస్తుందని చెప్పారు. అయితే ఉగాది వెళ్లిపోయినా ఇప్పటి వరకూ నాగబాబు మంత్రి పదవిపై ఊసే లేదు. పవన్ కల్యాణ్ చిన్న కుమారుడికి సింగపూర్ లో ప్రమాదం జరగడం, తర్వాత ఆయన వెన్ను నొప్పితో బాధపడుతుండటంతో పాటు కొన్ని సమస్యలతో నాగబాబు మంత్రి పదవి మరికొన్నాళ్లు వాయిదా పడినట్లు తెలిసింది. దీంతో పాటు చంద్రబాబు నాయుడు కూడా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి పదిహేడో తేదీ నుంచి ఐదు రోజుల పాటు యూరప్ పర్యటనలో ఉంటారు. చంద్రబాబు తన 75వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకునేందుకు వెళుతున్నారు. దీంతో పాటు వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ పర్యటన అమరావతిలో ఉండనుంది. అంటే మే మొదటి వారం వరకూ నాగబాబు మంత్రి పదవి గురించి ఆలోచన చేసే అవకాశం ఉండకపోవచ్చు. నాగబాబును పిఠాపురం నియోజకవర్గానికి పంపిన పవన్ కల్యాణ్ అక్కడ పరిస్థితులను చక్కబెట్టాలని భావిస్తున్నారని తెలిసింది. మంత్రి పదవిలో ఉంటే పిఠాపురంలో మరింతగా రాజకీయ ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచన కూడా పవన్ చేస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్సీగా ఉండి పిఠాపురంలో అన్నీ చక్కబెట్టేందుకు నాగబాబు సేవలను ఉపయోగించుకుంటే మంచిదని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు కూడాచెబుతున్నాయి. అందుకే పవన్ కల్యాణ్ కూడా మంత్రి పదవి విషయంలో చంద్రబాబు వద్ద పట్టుబట్టడం లేదని, నిజంగా మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే వెంటనే చంద్రబాబుతో మాట్లాడి గవర్నర్ అపాయింట్ మెంట్ తీసుకుని ప్రమాణ స్వీకారం చేయించేవారంటున్నారు.. కుటుంబంలో ఇద్దం మంత్రివర్గంలో ఉంటే పార్టీని బలోపేతం చేయడం కుదరదని కూడా పవన్ కల్యాణ్ భావిస్తున్నారని అంటున్నారు. అందుకే నాగబాబుకు పిఠాపురం బాధ్యతలను అప్పగించి తాను జిల్లాల పర్యటనలు చేయించాలన్న ఉద్దేశ్యంతో పవన్ కల్యాణ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఏమాత్రం పవన్ కల్యాణ్ కు ఆలోచన ఉన్నా వెంటనే మంత్రి పదవి విషయం చంద్రబాబు వద్ద ప్రస్తావించే వారంటున్నారు. దీంతో పాటు ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ జరిపితే చంద్రబాబుకు కూడా తలనొప్పిగా ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వస్తున్న నేపథ్యంలో నాగబాబుకు మంత్రి పదవి ఇప్పట్లో లేనట్లేనన్న ప్రచారం మాత్రం జనసేన లో బాగా వినపడుతుంది.

## సంపాదకీయం

# సెంట్రల్ వర్శిటీ అటవీ భూములేనా


హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద వివాదాస్పదంగా మారిన 400 ఎకరాల 'కంచ గచ్చిబౌలి' భూములపై సుప్రీం కోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ–సీఈసీ) నివేదిక కీలకంగా మారింది. పర్యావరణపరంగా అడవికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఆ భూమికి ఉన్నాయని సీఈసీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వ రికార్డుల ప్రకారం, కంచ గచ్చిబౌలి భూములు 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారీ' భూములుగా నమోదై ఉన్నాయి. సీఈసీ ఇచ్చిన నివేదికతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగే అవకాశం కనిపిస్తోంది.'కంచ గచ్చిబౌలి' భూముల వివాదంపై ఇప్పటికే సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది. ఏప్రిల్ 16న విచారణ సందర్భంగా చెట్లను కొట్టివేసిన వంద ఎకరాల్లో పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది. అప్పటివరకు వివాదాస్పద '400 ఎకరాల కంచ గచ్చిబౌలి' భూముల్లో ఎలాంటి కార్యకలాపాలూ జరగకుండా స్టే విధించింది. సెంట్రల్ ఎంపర్డ్ కమిటీ నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఆనుకుని ఉన్న 'కంచ గచ్చిబౌలి' భూములపై వివాదం రేగిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టులో కేసు నమోదు కావడంతో ఏప్రిల్ 3న విచారణ మొదలైంది. చెట్ల నరికివేతను ఆపాలంటూ స్టే ఇచ్చింది. అనంతరం కేంద్ర సాధికార కమిటీని నియమించింది. ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు వివాదాస్పద 400 ఎకరాలను పరిశీలించి, సుప్రీంకోర్టుకు నివేదికను సమర్పించారు. అయితే భూమికి సంబంధించిన హక్కులను తెలంగాణ ప్రభుత్వం 2024 జులైలోనే టీజీఐఐసీకి బదలాయించింది. దీంతో టీజీఐఐసీ ఈ ఏడాది మార్చి 30న ఆ ప్రదేశంలో చెట్లను నరికివేసి భూమిని చదునుచేసే పనులు మొదలుపెట్టింది."టీజీఐఐసీ వివరాల మేరకు 122 ఎకరాల్లో చెట్లను పూర్తిగా వేర్లతో సహా కొట్టేశారు" అని నివేదికలో సీఈసీ స్పష్టం చేసింది. వాల్టా చట్టం 2004 ప్రకారం కొన్ని మినహాయింపులున్న చెట్లను కొట్టివేయాలంటే సెల్ఫ్ డిక్లరేషన్‌తో కొట్టివేయొచ్చు. ఇందుకు ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌కు ఫారం 13ఏ ఇచ్చి, నిర్దేశిత ఫీజు చెల్లిస్తే సరిపోతుందని అటవీ శాఖాధికారులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు."మార్చి 17నే టీజీఐఐసీ దరఖాస్తు చేసుకుంది. మార్చి 29న అవసరమైన పరిహారం కూడా చెల్లించింది" అని చెప్పారు. 125 మినహాయింపు లేని చెట్లను కూడా కూల్చివేసినట్లుగా ఏప్రిల్ 3న చిలుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరిశీలనలో గుర్తించారని సీఈసీ తన నివేదికలో పేర్కొంది. 1524 చెట్లను కూల్చివేయగా.. అందులో 1399 చెట్లకు వాల్టా చట్టం నుంచి మినహాయింపులున్నాయి" అని చెప్పింది. సీఈసీ మొత్తం 69 పేజీల నివేదికను సుప్రీంకోర్టుకు ఇచ్చింది. ఇందులో కంచ గచ్చిబౌలి భూములకు 'అడవి' అని చెప్పడానికి కావాల్సిన గుణం ఉందని స్పష్టం చేసింది."ప్రాథమిక పరిశీలన ప్రకారం, ఆ ప్రాంత సహజ లక్షణం, పర్యావరణ పరంగా అడవిని తలపిస్తోంది" అని నివేదికలో పలుమార్లు ప్రస్తావించింది."ఈ ఏడాది మార్చి 4న అటవీ లక్షణాలు కలిగిన భూములు గుర్తించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా చదును చేసే పనులు చేపట్టారు. వన చట్టం 2023ను పట్టించుకోకుండానే టీజీఐఐసీ చదును చేసే పనులు మొదలుపెట్టింది" అని సీఈసీ తన నివేదికలో పేర్కొంది. అలాగే టీజీఐఐసీ కూడా డీపీఆర్ సిద్ధం చేయకుండా నేరుగా అడవి వంటి లక్షణాలు కలిగిన ఆ భూమిని చదును చేయడానికి ముందుకెళ్లిందని సీఈసీ అభిప్రాయపడింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1975లో దాదాపు 2324 ఎకరాలను కేటాయించింది . విశాలమైన ప్రాంతం కావడంతో ఇదంతా పచ్చదనం, చెట్లతో నిండి ఉంటుంది. జింకలు, నెమళ్లు కనిపిస్తుంటాయి. సీఈసీ తన నివేదికలో ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది." ఈ ప్రాంతం పర్యావరణం, పచ్చదనం పరంగా ఉన్నతంగా ఉంది. రాళ్ల అమరికలు, కుంటలు, జీవవైవిధ్యం కారణంగా అక్కడ ఏదైనా పనులు చేయాలంటే కచ్చితంగా గట్టి పరిశీలన జరగాలి. అటవీ చట్టాల ప్రకారం అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవడమైనా సరే, నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. టీజీఐఐసీ తమకు యాజమాన్య హక్కులు ఉన్నట్లుగా చెబుతున్నప్పటికీ, అన్ని అనుమతులూ తీసుకోలేదు. భూమిని మార్టిగేజ్ చేయడం కూడా ఆర్థికంగా తీవ్రమైన ఉల్లంఘనగా భావించాలి" అని చెప్పింది. ఈ భూమిని బేకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ పేరుతో మార్టిగేజ్ చేసి నాన్–కన్వర్టబుల్ బాండ్లు జారీ చేసినట్లుగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏప్రిల్ 10న సీఈసీకి ఇచ్చిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. దీనిపై సుప్రీంకోర్టు ఏప్రిల్ 16న తన విచారణ సందర్భంగా స్పందించింది."భూమిని మార్టిగేజ్ చేశారా లేదా.. అనే విషయం జోలికి మేం వెళ్లదలుచుకోలేదు. మేం జీవ వైవిధ్యం గురించి మాట్లాడుతున్నాం" అని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి పనులూ మొదలుపెట్టకూడదుక్షేత్రస్థాయి అటవీ శాఖాధికారులు, వన్యప్రాణుల నిపుణులు, పర్యావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే సంస్థ ప్రతినిధులతో కమిటీ వేసి అటవీ తరహా ప్రాంతాలను గుర్తించాలి. అటవీ చట్టం 2023 ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరంగా ఇబ్బంది లేకుండా భూములను విభజించేందుకు ప్రత్యేక నిబంధనలు రూపొందించాలి.

# భారతీయతకు విశ్వగౌరవం




భారతదేశం భౌగోళికంగా ఒక దేశమే కావొచ్చు. కానీ ఇది అనేక సంస్కృతుల, భాషల, సంప్రదాయాల సమ్మేళనం. మన దేశ చరిత్ర చూసినప్పుడు, వేలాది సంవత్సరాల నాటి జ్ఞాన సంపద, తత్త్వ సారాలు కనిపిస్తాయి. మనం చెప్పుకునే రామాయణం, మహాభారతం, ఉపనిషత్తులు, నాట్యశాస్త్రం, భగవద్గీత వంటి గ్రంథాలు కేవలం మతపరమైన రచనలు కావు. అవి జీవన పాఠాలు. భారతీయత అనే భావనను నిర్వచించే మూలస్తంభాలు. ఈ సాంస్కృతిక సారస్వతానికి తాజాగా యునెస్కో ఇచ్చిన గుర్తింపు మన దేశానికి మాత్రమే కాక, ప్రపంచ మానవ సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోంది. భగవద్గీతను, నాట్యశాస్త్రాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించడం ద్వారా భారతీయ విలువలకు, కళలకు అంతర్జాతీయ గౌరవం దక్కింది. భగవద్గీతను ఒక మతపుస్తకంగా చూడటం అన్యాయమే. అదొక తత్త్వశాస్త్ర గ్రంథం. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు ఆత్మవిశ్వాసంతో, ధర్మబద్ధంగా ఎలా స్పందించాలో తెలిపే మార్గదర్శి. గీతలో అర్జునుడు తన కర్తవ్యం విషయంలో సందిగ్ధంలో పడినప్పుడు, శ్రీకృష్ణుడు ఇచ్చిన ఉపదేశం కేవలం ఆ యుద్ధానికి మాత్రమే సంబంధించినది కాదు. అది యుగయుగాలుగా అన్ని తరాల మానవులకు వర్తించగల సందేశం. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే వాక్యం ఎప్పటికీ మారని తత్త్వాన్ని తెలియజేస్తుంది. మనం ఫలితాల కోరిక లేకుండా, నైతికతను అనుసరించి కర్మ చేయాలని చెప్పిన ఈ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా మనుషుల జీవితాలను మార్చగల సామర్థ్యం కలిగి ఉంది. ఇప్పుడు ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో గీతాపఠనం ఒక తత్త్వశాస్త్ర అధ్యయనంగా మారింది. అది మతపరంగా కాకుండా, తాత్వికంగా, జీవన విలువల పరంగా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఈ దృష్టితో యునెస్కో దీన్ని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చింది. ఇది భారతీయతకు వచ్చిన గౌరవమే కాక, ప్రపంచానికి మన జ్ఞాన సంపదను అర్థం చేసుకునే అవకాశం కూడా. గీతలోని ఉపదేశాలు విశ్వ మానవ విలువలకు దగ్గరగా ఉండటం వల్ల దీన్ని ఒక మానవతా గ్రంథంగా భావిస్తున్నారు. నాట్యశాస్త్రం విషయానికి వస్తే, ఇది కేవలం నాట్యకళకు సంబంధించిన పుస్తకం కాదు. ఇది మన కళా సంపదకు మూలమైన శాస్త్రరూపం. నాట్యం అంటే శరీరంతో చేసే విన్యాసాలు మాత్రమే కాదు. అది భావాలు, భావోద్వేగాలు, తత్త్వాలు అన్నిటినీ సమన్వయపరిచే ఒక సమగ్ర కళ. హస్త ముద్రలు, నవరసాలు, సంగీతమూ, నృత్యంతో కలసి ఒక సందేశాన్ని ఎలా తెలియజేయాలో నాట్యశాస్త్రం స్పష్టంగా వివరిస్తోంది. భారతదేశంలోని అనేక నాట్య రూపాలు%–% భరతనాట్యం, కూచిపూడి, కథక్, ఒడిస్సీ%–% అన్నింటికీ నాట్యశాస్త్రమే మూలంగా ఉంది. ఇవి ప్రాంతీయ కళలు మాత్రమే కాదు. ప్రతి నాట్య రూపకంలోనూ భావప్రకటన, శరీరచలనం, సంగీత సామరస్యం ఉన్నాయి. ఈ రెండు గ్రంథాలకు యునెస్కో గుర్తింపు లభించడానికి వెనుక అనేక శ్రమలు ఉన్నాయి. భారత ప్రభుత్వం, ముఖ్యంగా ఇటీవల మోదీ ప్రభుత్వంలో, భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాల ప్రచారానికి పెద్దపీట వేసింది. విదేశాంగ శాఖ, యునెస్కో సంస్థలతో సమన్వయం, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతినిధుల అవగాహన, ఇతర దేశాల మద్దతు%–% ఇవన్నీ ఈ గుర్తింపునకు కారణమయ్యాయి. ఈ గుర్తింపు మనకెంతో గర్వాన్ని కలిగించినప్పటికీ, ఇది ఒక బాధ్యతను కూడా గుర్తుచేస్తోంది. మనం ఈ సంపదను కాపాడాలి. యువతకు ఈ జ్ఞానాన్ని చేరవేయాలి. మన విద్యా వ్యవస్థలో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్నతనం నుంచే భగవద్గీతలోని తాత్విక భావాలను, నాట్యకళలోని సున్నితత్వాన్ని, మన సంప్రదాయాల విలువను పిల్లలకు నేర్పాలి. ఇది కేవలం పాఠ్యాంశంగా కాకుండా, ఒక జీవన విధానంగా ఉండాలి. మనకు కూచిపూడి అనే ప్రాచీన నాట్యకళ ఉంది. ఇది నాట్య శాస్త్రానికి ప్రాణం. కానీ, మనం ఈ కళను ఎంతవరకు సంరక్షిస్తున్నాం? అనే ప్రశ్న మనల్ని కాసేపు ఆలోచనలో పడేస్తుంది. ప్రభుత్వాల ప్రోత్సాహం తక్కువగా ఉండటం, పరిశోధనలకు సరైన వనరులు లేకపోవడం వల్ల, మన కళలు కనుమరుగవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నాట్య పాఠశాలలు, కళా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలను స్థాపించాలి. కూచిపూడి నాట్యకళను ప్రపంచానికి తెలియజేయగల ప్రణాళికలను తయారు చేయాలి. ఇప్పటి వరకు గీత, నాట్యశాస్త్రం లాంటి అంశాలను పాశ్చాత్య దేశాలు చాలాసార్లు 'పౌరాణిక రచనలు', లేదా 'తక్కువ విలువ ఉన్న విషయాలు'గా చూశాయి. కానీ ఇప్పుడు అదే ప్రపంచం వాటిని శాస్త్రీయంగా అంగీకరిస్తోంది. ఇది ఒక పెద్ద సాంస్కృతిక మార్పు. ప్రస్తుత గుర్తింపు కేవలం ఒక పురస్కారం కాదు. గీతా, నాట్యశాస్త్రం లాంటి గ్రంథాల పరిరక్షణ మనకు లభించిన అవకాశంగా కాకుండా, ఒక కర్తవ్యంగా భావించాలి. భారతీయత అనేది మాటల్లో చెప్పే భావం కాదు. అది అనుభవంలో, ప్రవర్తనలో, జీవనశైలిలో ప్రత్యక్షమవుతుంది. గీతలోని ధర్మబద్ధతను మన వృత్తిజీవితంలో పాటించాలి. నాట్యశాస్త్రంలోని కళాసౌందర్యాన్ని మన వ్యక్తిత్వంలోనూ కలుపుకోవాలి. మనం మన జ్ఞాన సంపదను మనం గౌరవిస్తే, ప్రపంచం కూడా గౌరవిస్తుంది. విద్య, పరిశోధన, కళ, తత్త్వశాస్త్రం%–% అన్నింటిలో మన సంపదను అర్థవంతంగా వినియోగించాలి. అప్పుడు మాత్రమే ఈ యునెస్కో గుర్తింపు సార్థకం అవుతుంది.

# వినాశనబాటలో విశ్వవిద్యాలయాలు



హార్వర్డ్ విశ్వవిద్యాలయం తన స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వాధీనం చేయబోదు. తన రాజ్యాంగ హక్కులు వదులుకోబోదు... ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏమి బోధించాలి, ఏ విద్యార్థులను చేర్చుకోవాలి, ఏ సిబ్బందిని నియమించుకోవాలి, ఏ పరిశోధనలు జరపాలి అనే విషయాలు ఆదేశించజాలదు'... విశ్వవిద్యాలయ వ్యవహారాల నిర్వహణలో పాలకుల జోక్యానికి ప్రతిస్పందిస్తూ ఏ భారతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఇంత నిక్కచ్చిగా మాట్లాడి ఉంటారు? సమాధానం 'ఎవ్వరూ కారు' అని మాత్రమే. ఈ కాలమ్ ప్రారంభ మాటలు హార్వర్డ్ విశ్వవిద్యాలయ (అమెరికా సంయుక్త రాష్ట్రాల కంటే పురాతన సంస్థ) అధ్యక్షుడు అలాన్ గార్బర్‌వి. ఈ ధరిత్రిపై తన కంటే శక్తిమంతుడు అయిన వ్యక్తి మరొకడు లేడని విశ్వసిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలను గార్బర్ ధిక్కరించారు. అందుకు ఆగ్రహించిన ట్రంప్ హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధుల విడుదలను నిలిపివేశారు. అయినప్పటికీ శ్వేత సౌధ ఆసామీ ఆదేశాలను పాటించేందుకు హార్వర్డ్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. గత నెలలో మరో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం కొలంబియాకు 400మిలియన్ డాలర్లను మంజూరు చేసేందుకు ట్రంప్ నిరాకరించారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆయన షరతులకు కొలంబియా సమ్మతించింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) వెబ్‌సైట్ ప్రకారం జనవరి 25, 2023 నాటికి భారత్‌లో 1074 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు 460బీ డీమ్డ్ విశ్వవిద్యాలయాలు 128, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు 56, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు 430 వెరసి మొత్తం 1074. స్వాతంత్ర్య సాధనకు చాలా పూర్వమే 1857లో ప్రారంభమైన కలకత్తా, మద్రాస్, బాంబే విశ్వవిద్యాలయాలు కూడా వీటిలో ఉన్నాయి. యూజీసీ గవర్నర్–ఛాన్సలర్ మధ్య అభిప్రాయ విభేదాలు కారణంగా మద్రాసు విశ్వవిద్యాలయానికి ఆగస్టు 2023 నుంచి వీసీ నియామకం జరగనేలేదు. పార్లమెంటు చేసిన చట్టాలు, యూజీసీ చట్టం–1956ను యూజీసీ అమలుపరుస్తున్న తీరుతెన్నుల పుణ్యమా అని భారతీయ విశ్వవిద్యాలయాలు స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించలేకపోతున్నాయి. యూజీసీ చట్టంలోని 12వ సెక్షన్ ప్రకారం బోధనా ప్రమాణాలను నిర్ణయించడం, పరీక్షలు, పరిశోధనల నిర్వహణకు విశ్వవిద్యాలయాలకు యూజీసీ నిధులు ఇస్తుంది. 1984లో సెక్షన్ 12ఎ ను చేర్చి సెక్షన్ 14ను సవరించడం ద్వారా యూజీసీ అధికారాలను విస్తృతపరిచారు. నిధుల పంపిణీ అధికారాలు ఉన్న కారణంగా యూజీసీ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన ప్రతి వ్యవహారంలోను నియమ విరుద్ధంగా జోక్యం చేసుకోవడం అధికమయింది. సదరు నిబంధనలు ఇచ్చిన అధికారాలతో ఒక విశ్వవిద్యాలయం స్వతంత్ర ప్రతిపత్తిని యూజీసీ పూర్తిగా హరించి వేయగలుగుతోంది. యూజీసీపై నియంత్రణ ద్వారా భావజాల పక్షపాతంతో వ్యవహరించే కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయ అధ్యాపకుల నియామకాలు, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, పరిశోధనా రంగాలు, పరీక్షల నిర్వహణను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తోంది. యూజీసీ నిర్దేశిస్తున్న కొన్ని అనుచిత నిబంధనలు: అధ్యాపకులు, ఇతర బోధనా సిబ్బంది విద్యార్హతలు, నియామకాలకు సంబంధించిన నిబంధనలుబీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)బీ నేషనల్ ఎలిజిబిలిటీ అండ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (నీట్)బీ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)బీ కామన్ యూనివర్శిటీ ఎంట్రెన్స్‌బీ ది లెర్నింగ్ అవుట్ కమ్స్ –బేస్డ్ ఫ్రేమ్‌వర్క్ (ఎల్ఓసీఎఫ్)బీ చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్), నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్). వైస్ ఛాన్సలర్లు 'అవశిష్ట' అధికారాలను ఉపయోగించుకుంటున్న కారణంగా వీసీల ఎంపిక, నియామకం వ్యవహారాలను యూజీసీ తన నియంత్రణలోకి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నది. నా అభిప్రాయంలో ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల బోధన, బోధనేతర సిబ్బంది, ముఖ్యంగా వీసీల ఎంపిక, నియామకాలలో యూజీసీకి పాత్ర లేదు, ఉండకూడదు. మరి యూజీసీ అటువంటి పాత్ర నిర్వహించేందుకు అనుమతిస్తే అది విశ్వవిద్యాలయాల జాతీయాకరణకు రంగాన్ని సిద్ధం చేయడమే అవుతుంది. విశ్వవిద్యాలయాపై విస్తృత నియంత్రణ ఉన్నత విద్యారంగంలో పరిస్థితుల మెరుగుదలకు దోహదం చేస్తుందా? ఏ భారతీయ విశ్వవిద్యాలయానికి ప్రపంచ అగ్రగామి 100 విశ్వవిద్యాలయాలలో స్థానం లభించడం లేదు. అత్యున్నత ర్యాంక్ పొందిన భారతీయ ఉన్నత విద్యాసంస్థ బాంబే ఐఐటి. ఈ సంస్థకు లభించిన ర్యాంక్ 118. అక్టోబర్ 21, 2024 నాటికి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టుల సంఖ్య 5182 అని ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. ఐఐటీ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ నియామకాలు (ప్లేస్‌మెంట్స్) తగ్గి పోయాయని విద్యాశాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం వెల్లడించింది. 2021-22 నుంచి 2023-24 సంవత్సరాల మధ్య ఈ నియాకాలు పది శాతానికి పైగా తగ్గి పోయాయి. ఎన్ఐటీ గ్రాడ్యుయేట్ల ప్లేస్‌మెంట్‌లు కూడా 10.77 శాతం మేరకు తగ్గిపోయాయి. భారతీయ విశ్వవిద్యాలయాలలో శిక్షణపొంది నోబెల్ పురస్కారం పొందిన ఒకే ఒక్క భారతీయ శాస్త్రవేత్త సి.వి. రామన్ మాత్రమే. విద్యావిషయక స్వేచ్ఛ కుదించుకుపోతోంది. ఇదొక ఆందోళనకరమైన పరిణామం. అసహన సమూహాలు జేఎన్‌యూ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, జమియా మిలియా, ఏఎమ్‌యూ, జాదవపూర్, జమ్ము సెంట్రల్ వర్శిటీలతో సహా పలు విశ్వవిద్యాలయాలు (వాటి అధ్యాపకులు, విద్యార్థులు)పై విమర్శానాస్త్రాలను సంధిస్తున్నాయి. భౌతిక దాడులకూ పాల్పడుతున్నాయి. యూజీసీ చట్టాన్ని రద్దు చేసి, పునః రూపొందించి, అమలుపరచనిపక్షంలో విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తి ఒక సుదూర లక్ష్యంగా మాత్రమే ఉండిపోతుంది. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో ఆర్థిక వనరులను సమకూర్చుకోకపోతే విద్యావిషయక స్వేచ్ఛ ఒక ఎండమావి అవుతుంది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు బదులు సంపన్న కుటుంబాలు, కార్పొరేట్ సంస్థలు నిధులు సమకూర్చి ప్రమోట్ చేసే ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరిగిపోతాయి. వితరణశీలతే ఆ భాగ్యవంతుల సంకల్పం కావచ్చు కానీ ఫలితం మాత్రమే పక్కా వ్యాపారమే సుమా!


# నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులెడుతోంది : ప్రణీత్ పెనుమాడు





**ఏప్రిల్ 20,( ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** వజ్రోత్సవ పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటున్న మా అధినాయకుడు నారా చంద్రబాబునాయుడుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడం చాలా సంతోషకరంగా ఉంది. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుగిన విషయం విదితమే. ఈ క్రమంలో తిరుపతి టిడిపి ముఖ్య నాయకులు నిర్వహించిన నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలలో ఎడిఫై స్కూల్స్ డైరెక్టర్, ప్రణీత్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రణీత్ పెనుమాడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అలిపిరి మెట్లు వద్ద నారా చంద్రబాబు నాయుడు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని వేడుకుంటూ 750 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రణీత్ పెనుమాడు మాట్లాడుతూ గొప్ప దార్శనికుడు పాలనా దక్షుడు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు పాలనలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులేడుతోందని అన్నారు. అంతకుముందు ప్రణీత్ పెనుమాడు ఎస్ వి యూనివర్సిటీలో నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రణీత్ పెనుమాడుతో ప్రణీత్ ఫౌండేషన్ సిబ్బంది, ఎడిఫై స్కూల్స్ పీఆర్వో రాజేష్,సురేంద్ర, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పంపనూరు సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్న తలారి పరుశురాముడు దంపతులు

**గుంతకల్లు ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):** అనంతపురం పంపనూరు సుబ్రహ్మణ్య స్వామిని కసాపురం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త తలారి పరశురాము. డు శకుంతలమ్మ దంపతులు దర్శించుకున్నారు. పంపనూరు దేవస్థానం ఈవో బాబు,అర్చకులు తలారి పరుశు రాముడు దంపతులకు స్వాగతం పలుకుతూ సుబ్రహ్మణ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు.స్వామివారి సూలంతో పల్లకి సేవలో పాల్గొనడం జరిగినది.అనంతరం తలారి పరుశురాముడు దంపతులకు ఏవో బాబు శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది. ఈవో బాబు మాట్లాడుతూ కసాపురంలో తన సొంత నిధులతో కసాపురం గ్రామంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం నిర్మించడం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహిస్తూ 2 సం"గా అన్నం పరబ్రహ్మంగా స్వరూపంగా భావించి ప్రతిరోజు నిత్య అన్న ప్రసాద వితరణ చేయడం తక్కువ సమయంలోనే ఎంతో అభివృద్ధి చెందిన దేవస్థానం లో ఒకటిగా నిలవడం చాలా సంతోషం వీరి జీవితం ఎందరోకో ఆదర్శం అన్నారు. తలారి పరుశురాముడు మాట్లాడుతూ సుబ్రహ్మణ్య స్వామి వారి దర్శనం మహా భాగ్యమని,మా చేత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ ఈవో బాబు ఆలయ అర్చకులకు సుబ్రహ్మణ్య స్వామి భక్తులకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే సినిమాపై మనువాదుల గొడ్డలి పెట్టు

## శ్రీ సత్య సాయి జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా



**గుంతకల్లు ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని ఏపీ పెన్షనర్స్ ఆఫీస్ నందు వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహారాష్ట్ర లో దర్శకుడు అనురాగ్ కశ్యప్ మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల జీవితం ఆధారంగా నిర్మించిన పూలే సినిమాకు పలుసార్లు సెన్సార్ జరిగినప్పటికీ సెన్సార్ బోర్డు ఇంకా ఆటంకాలు సృష్టిస్తూ క్లియరెన్స్ ఇవ్వకుండా విడుదలకు నోచుకోకపోవడం కడుశోచనీయం అని శ్రీ సత్యసాయి జిల్లా, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ భాషా పేర్కొన్నారు. సినిమా లో ఉన్న వాస్తవాలు సభ్య సమాజానికి తెలిసిపోతుంది అన్న ఉద్దేశంతో మనువాదుల కుట్రలకు సెన్సార్ బోర్డు సందేశమైన సినిమాకు ఆటంకాలు సృష్టించడం చారిత్రాత్మిక తప్పిదమవుతుందని అశ్లీల సినిమాలు కు స్మగ్లింగ్లు సినిమాలకు తొడగొట్టుకోవడాలు నరకోవడాలు లాంటి హింసాత్మక సినిమాలకు క్లియరెన్స్ ఇస్తున్నటువంటి సందర్భంలో మన భారత దేశంలో విద్యను మహిళలకు మనువాదులు నిషేధిస్తే పూలే తన భార్యకు సావిత్రిబాయి పూలే కి చదువు నేర్పించి ఆమె ద్వారా లక్షలాది మంది మహిళలకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దిన పూలే దంపతుల ను భారతావని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాంటి సినిమాలకు సెన్సార్ బోర్డు ఆటంకాలు సృష్టించడం మంచిది కాదని అన్నారు.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్,భారతి సాహితీ సమితి కార్యదర్శి వి గంగరాజు,ఆర్డీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు తంగరం.రామాంజనేయులు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చలపతి, పరంధామ,కళా సమితి అధ్యక్షులు ఈవో రాముడు, మహనీయుల సేవా సమితి అధ్యక్షులు స్టాండ్లీ బాబు, రిటైర్డ్ టి పి ఆర్ ఓ ఓ. రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అబ్బురపరిచిన చిన్నారుల నృత్యం.




**ఏప్రిల్ 20,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అనంతపురం కు చెందిన అనంత కళా స్రవంతి అనితా నాగరాజు వారి శిష్య బృందంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు. మోక్ష, లాస్య ప్రియ, ధ్రువర్షిత, దీక్షిత, గీతికా,పూజశ్రీత,ఇషితా, జెనిషా,దేవాన్షకిత,లాస్య,నైనిక, నైనీత,కల్పన సిరి,శ్రీదేవి,వరేణ్యా ,దేవాన్షిక, చర్విక, నిహారిక, అర్పిత,నేహా శ్రీ,తన్విక,చర్విక అద్భుత ప్రదర్శన ఇచ్చారు. పాటకు తగిన హావభావాలు, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అధితులుగా భారతీయ నృత్య సంస్థాన్ అధ్యక్షులు డా ఆర్. ఎన్.పి శ్రీనాథ్ ప్రసాద్ ఏ వో సుధాకర్ శాలువతో సత్కరించి కళాకారులకు ప్రశంసా పత్రాలు మరియు జ్ఞాపికలు అందజేశారు.

# అట్టహాసంగా నవ యుగ పురుషుడి జన్మదిన వేడుకలు

**పోటెత్తిన డాలర్స్ అధినేత అభిమాన త్రయం**

**జై చంద్రబాబు నినాదాలతో హెూరెత్తిన వైకుంఠపురం సర్కిల్**




**ఏప్రిల్ 20,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** డాలర్స్ గ్రూప్ అధినేత, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి దివాకర్ రెడ్డి అభిమానులు ఆదివారం నవయుగ పురుషుడు సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వైకుంటపురం సర్కిల్ వేదికగా జరిగిన బాబు జన్మదిన వేడుకలలో సుమారు 500 మందికి పైగా దివాకర్ రెడ్డి అభిమానులు పాల్గొని కేక్ కట్ చేసి జై చంద్రబాబు నినాదాలతో హెూరెత్తించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి పైగా పేదలకు పెద్ద ఎత్తున అల్పాహార కార్యక్రమం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రుల ఆరాధ్య దైవం సీఎం చంద్రబాబు నిండు నూరేళ్ల ప్రజాసేవలో కొనసాగేలా కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. తమ అభిమాన దైవం డాక్టర్ సి దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి సైనికులుగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# మే 8,9 తేదీల్లో తుడ టవర్స్ వాణిజ్య గదుల వేలం

**ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య**



**ఏప్రిల్ 20,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తుడా టవర్స్ వాణిజ్య గదుల విక్రయాన్ని మే 8,9, తేదీల్లో ఈ వేలం నిర్వహించనున్నట్లు తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరములోని అన్నమయ్య కూడలి వద్ద 3.60 ఎకరముల స్థలములో %+%౦13 అంతస్తులతో ప్రతిష్టాత్మకంగా "తుడ టవర్స్" నిర్మిస్తున్న విషయం విదితమే. ఇందులోని నివాసయోగ్యమైన గదులకు వేలం నిర్వహించామని తెలిపారు. తుడ టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్ (10 గదులు), మొదటి అంతస్తు (21 గదులు)లోని వాణిజ్య గదులను మే 8, 9 తేదిల యందు ఈ - వేలము ద్వారా అమ్ముటకు నిర్ణయించామని తెలిపారు. వాణిజ్యపు గదులు 2000 నుండి 9000 చదరపు అడుగుల విస్తీర్ణముతో నగర వాణిజ్య సముదాయములకు అత్యంత అనువైనదిగా నిర్మిస్తున్నామని తెలిపారు. వివరముల కొరకు తుడ కార్యాలయము, తుడ టవర్స్ వెబ్సైట్లు www.tudatowers.in/www.tudaap.in సంప్రదించవలసినదిగా ఉపాధ్యక్షులు ఆ ప్రకటనలో కోరారు.

# శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఘనంగా సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

**తిరుమల అఖిలాండడం వద్ద 750 కొబ్బరికాయలతో మొక్కులు చెల్లింపు**



**ఏప్రిల్ 20,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వజ్రోత్సవ పుట్టినరోజు వేడుకలను నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ హర్షం వ్యక్తం చేశారు.ఆ8వరం తిరుమలలో అఖిలాండడం వద్ద ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను తిరుమల అఖిలాండం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ వర్మ మాట్లాడుతూ శ్రీవారి ఆలయం ఎదుట ఉన్న అఖిలాండడం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సీఎం చంద్రబాబు నాయుడు 75 వ జన్మదిన సందర్భంగా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీఎం ఆయురారోగ్యాలుగా ఉండాలని కోరుతూ 750 కొబ్బరికాయలు కొట్టడంతో పాటు ఏడున్నర కిలోల కర్పూరాన్ని స్వామివారికి సమర్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం అలుపెరగని పోరాట యోధుడు ముఖ్యమంత్రి అని గుర్తు చేశారు. ఆయన మార్గం మనందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయన అడుగుజాడల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం మనమందరం పాలు పంచుకుందామని పిలుపునిచ్చారు. ప్రజాదరణ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడు అని తెలిపారు. బడుగు బలహీన వర్గాల జీవితాలలో చిరస్థాయిగా నిలిచిపోయే వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. ఒక గొప్ప నాయకుడు ఆదర్శంగా తీసుకుని పార్టీలో పని చేయడం అదృష్టంగాభావిస్తున్నాను అని అన్నారు. నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రూపేంద్ర వర్మ, రాజు యాదవ్, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈస్టర్ వేడుకలు...

## పాస్టర్ సుధాకర్




**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలంలో పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకను పురస్కరించుకొని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.తుగ్గలి, రాతన చర్చిలో పాస్టర్లు సుధాకర్,సువర్ణరావు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.శుభ శుక్రవారం రోజున శిలువ శ్రమను, శిలువ మరణమును అనుభవించి, మూడవ దినము ఆదివారం నా పునరుత్థానము అయ్యారని చెప్పారు. ఆయన తన రక్తములతో పాపాలను కడిగి క్షమాగుణాన్ని అందించారని అన్నారు.

# క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

తిరుపతి ఎస్వీయూలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు.. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శాప్ ఛైర్మన్ రవినాయుడు
సీఎం బాల్య, సహచర మిత్రులతో ఆత్మీయ సమావేశం






**ఏప్రిల్ 20,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినం సందర్భంగా తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని సెనేట్ హాలులో పూర్వవిద్యార్థుల సహకారంతో సీఎం చంద్రబాబు బాల్య మిత్రులు, సహచర మిత్రులతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు 75సంవత్సరాల ప్రస్థానాన్ని, అనుభవాలను వారంతా నెమరువేసుకున్నారు. చంద్రబాబు నాయుడు బాల్యం, విద్యాభ్యాసం, రాజకీయ ప్రస్థానాన్ని వివరించారు. తొలుత శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నాయకుడు సీఎం చంద్రబాబునాయుడని, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారంతా సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఆయన 75ఏళ్ల ప్రస్థానాన్ని, అనుభవాలను తెలుసుకోవాలని ప్రతీఒక్కరూ తాపత్రయ పడుతున్నారన్నారు. ఆయన ప్రస్థానం, జీవితాన్ని నేటి యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు బాల్య, సహచర మిత్రులు, రాజకీయ శిష్యులు, గురువులు చంద్రబాబుతో తమకున్న అనుభవాలను పంచుకున్నారు.

**విద్యార్థి దశలోనే శ్రమదానం..**

మొదటిగా చంద్రగిరి నియోజకవర్గం శేషాపురానికి చెందిన సీఎం చంద్రబాబు బాల్యమిత్రుడు బొబ్బా దత్తాత్రేయుడు మాట్లాడుతూ చంద్రబాబు, నేనూ శేషాపురంలో కలిసి చదువుకున్నామని, ఆయన జ్ఞాపకశక్తి అపారమైనది అన్నారు. పాఠశాలస్థాయిలోనే శ్రమదానం చేయడంతోపాటు మాతో సహా చేయించేవారని తెలిపారు. ఇప్పటికీ తన చిన్ననాటి స్నేహితులను పేరుపేరునా పిలుస్తారన్నారు. అనంతరం ఆయన తోటి విద్యార్థి శేషాపురానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చంద్రబాబు అత్యంత చురుగ్గా ఉండేవారన్నారు. చిన్నవయసులోనే వ్యవసాయం చేసి తమకున్న 5 ఎకరాల భూమిని 20 ఎకరాలు చేశారన్నారు. మేమిద్దరం కలిసి ఎస్వీ యూనివర్సిటీలో చదువుకున్నామని, రాజగోపాల్‌రెడ్డి దగ్గర రాజకీయం శిష్యరికం చేశారన్నారు. నేడు ప్రపంచం మెచ్చిన నాయకుడిగా ఆయన ఎదగడం సంతోషంగా ఉందన్నారు.

**ప్రణాళికాబద్ధంగా అడుగులు..**

కందుల వారి పల్లికి చెందిన కొత్తపల్లి దేవరాజ్‌నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు చిన్నప్పటి నుంచి ఇప్పటికీ ఆయన గురించి నాకు తెలియనిది ఏమీ ఉండదని అన్నారు. పట్టుదల, సహనానికి మారుపేరు సీఎం చంద్రబాబునాయుడన్నారు. చిన్నప్పటి నుంచే లీడర్ అవ్వాలనేది చంద్రబాబు అభిలాష అన్నారు. కష్టం, సహనం, క్రమశిక్షణను నమ్ముకుని ఎదిగిన ఏకైక నాయకుడు చంద్రబాబు అన్నారు. చిన్నప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ఎదిగిన వ్యక్తని గుర్తు చేశారు. 1968లో 10వ తరగతి పూర్తయిన తర్వాత టికెట్‌లు తీయకుండా ట్రైన్‌లో ప్రయాణిస్తూ పట్టుబడిన సందర్భాలు అనేకమున్నాయంటూ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముఖ్యంగా చంద్రబాబు హస్తవాసి చాలా మంచిదని, అలాగే హాస్టల్‌లో పేకాడి సంబంధించిన డబ్బుతో పేదలకు పరీక్ష ఫీజులు కట్టేవాడని గుర్తు చేశారు. పీజీలో ఉంటుండగా యూత్ కాంగ్రెస్ నుంచి లీడర్‌గా నిలబడ్డారన్నారు.

**చంద్రబాబు వల్లే రాజకీయంలోకి వచ్చా..**

సీఎం చంద్రబాబుకు అత్యంత రాజకీయ సహచరుడైన మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ నన్ను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకొచ్చే ఎమ్మెల్యే చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని, చరిత్ర సృష్టించిన మహానాడులో అత్యంత క్రమశిక్షణతో మమ్మల్ని నడిపించారని వివరించారు. ఆయనలోని నాయకత్వ లక్షణాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. టీడీపీని పునాదిస్థాయిలో బలపరిచడంలో ఆయనదే కీలకపాత్రని అన్నారు. ప్రజాసేవే పరమావధిగా జీవిస్తున్నారన్నారు.

**బడుగు, బలహీన విద్యార్థులకు అండగా..**



ప్రొఫెషర్ దేవసేన నాయుడు మాట్లాడుతూ 1973లో ఎస్వీయూలో ఎమ్ఏ ఎకనామిక్స్‌లో చేరానని, అప్పటికే చంద్రబాబు నాకు సీనియర్ అని అన్నారు. ఎకనామిక్స్ డిపార్టుమెంటు ఛైర్మన్‌గా కూడా చేసేవారని, అన్ని కార్యక్రమాల్లోనూ చాలా చురుగ్గా పాల్గొనేవారన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు విద్యార్థి దశ నుంచే బడుగు బలహీన వర్గాల విద్యార్థులను అన్ని విధాలుగా పైకి తీసుకొచ్చేందుకు కృషి చేయడం గమనించానన్నారు. 1977లో ఎమ్మెల్సీగా పోటీ చేయాల్సిన ఆయన కొన్ని సమీకరణాల వల్ల ఆగిపోయారని, ఆ తర్వాత ఎమ్మెల్యేగా అవకాశం రావడం, గెలుపొందారన్నారు. ప్రస్తుతం దేశం గర్వించదగ్గ నాయకుడిగా ఎదిగిన ఆయనతో జర్నీ చేయడం గర్వంగా ఉందన్నారు.

**పట్టుదల, సహనం ఆయనకు బలం..**

సీఎం చంద్రబాబుకు మరో రాజకీయ సహచరుడైన పులిచర్ల సమితి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ 1978లో మేమిద్దరం రాజకీయ ప్రయాణం మొదలుపెట్టామన్నారు. చంద్రబాబును ఒక నాయకుడు కుర్రాళ్లు మీకెందుకు రాజకీయమంటూ అవహేళనగా మాట్లాడారని, దానికి చంద్రబాబు బదులిస్తూ ఏదొక రోజు నేను నాయకుడినవుతానని, అప్పుడు చూసుకుందామని సవాల్ విసిరారని గుర్తు చేశారు. మరో నాయకుడు మాకు అపాయిట్‌మెంట్ ఇచ్చి సుమారు గంటసేపు వేచిఉండేలా చేసి మా సహనంతో ఆడుకున్నారన్నారు. నేను వెళ్లిపోయినా కూడా చంద్రబాబు మాత్రం ఓపికగా ఉండి ఆయనను కలిసి వచ్చారన్నారు. అప్పుడు ఆయనకున్న పట్టుదల, సహనం గురించి బాగా తెలుసుకున్నానన్నారు. 1994 నాటికి ప్రజల్లో చంద్రబాబుకు అపారమైన అభిమానం నెలకొందన్నారు. ఆయన పేరు ఒక బ్రాండ్‌గా ఏర్పడిందన్నారు.

**ప్రణాళికాబద్ధంగా పనిచేశాం..**

సీఎంకు అత్యంత సన్నిహితుడు, సీనియర్ జర్నలిస్ట్ రవి మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో మేమంతా ప్రణాళికాబద్ధంగా పనిచేశామని అన్నారు. యూనివర్సిటీ ఎన్నికల్లో సైతం క్రమశిక్షణతోపాటు సమర్థులైనవారిని మాత్రమే పరిమితంగా ఎంపిక చేసేవారని వివరించారు. ఎదుటి వ్యక్తులను సమన్వయపరచడంలో చంద్రబాబు సిద్ధహస్తులన్నారు. రాజకీయంగా వ్యతిరేకత ఉన్న గ్రామాల్లో సైతం ఆయన పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కరించారన్నారు. ప్రతీ అంశం మీద సమగ్ర అవగాహన పెంచుకునేవారని తెలిపారు. యూనివర్సిటీలో కమ్యూనిస్టు పార్టీలు సైతం ఆయనతో సమన్వయం అయ్యేవని వెల్లడించారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

**ఎన్నికల్లో సరికొత్తగా ప్రచారం..**

సీఎం చంద్రబాబు తోటి విద్యార్థి బీఎన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ 1978లో ఎమ్మెల్యేగా పోటీచేసినప్పుడే సీఎం చంద్రబాబు వినూత్నంగా ఓటర్లకు ఉత్తరాలు రాసేవారన్నారు. హెరిటేజ్ సంస్థ స్థాపించినప్పుడు 15 పేజీలతో రూపొందించిన ప్రణాళికను చూసి ఆశ్చర్యమేసిందన్నారు. మరో సహచర విద్యార్థి రాధాకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయ్యాక నన్నొకసారి చూసి నా భుజం మీదు చేయి వేసినప్పుడు నా చుట్టూ ఉన్న స్నేహితులందరూ ఆశ్చర్యానికి లోనయ్యారని, ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నప్పుడు కూడా నేను వెళ్తే నాతో మాట్లాడేవారని వివరించారు. ఎంత ఎదిగినా ఎదుటి వ్యక్తులకు గౌరవం ఇచ్చే వ్యక్తి చంద్రబాబు అన్నారు.

మరో స్నేహితుడు చిల్లంగి రమణ మాట్లాడుతూ 1977లో నేను ఎక్కువగా గొడవలు పడేవాడినని, అప్పట్లోనే చంద్రబాబు నన్ను పిలిచి మంచి చెడు చెప్పేవారన్నారు. అనుకున్నది సాధించడంలో ఆయనదే పైచేయిగా ఉండేదన్నారు. కష్టాన్ని, దైవాన్ని నమ్ముకున్న వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. అలాగే ఆనంద్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశను సీఎం చంద్రబాబు బాగా అనుభవించారన్నారు. చంద్రబాబుకు తన మన అనే బేధం ఉండదని, అందరికీ న్యాయం చేస్తాడని అన్నారు. అలాగే శేషాపురానికి చెందిన సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ 1978లో చంద్రబాబుకు కమ్మవారు, రెడ్డిలు ఓట్లు వేయలేదని, ఎస్సీలు, బీసీలు మాత్రమే ఆయనకు ఓట్లు వేశారని గుర్తు చేశారు. ఆఖరికి మా మిత్రులు సైతం దొంగ ఓట్లు వేసి చంద్రబాబును ఓడించాలని కుట్రపన్నారన్నారు. ఆయన సినిమాటోగ్రఫీ మంత్రిగా చేసినప్పుడే ఎన్టీఆర్‌తో పరిచయం ఏర్పడిందన్నారు. ఆయనకు 16 గంటలు పనిచేయకపోతే నిద్రపట్టదన్నారు. అలాగే రామ్‌నాథం నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు ఆలోచన విధానమే ఆయనకు బలమని, రాజధాని నిర్మాణానికి సైతం రైతులు ముందుకొచ్చి తమ భూములను స్వచ్ఛందంగా ఇస్తున్నారంటే ఆయన పరిపాలన ఏ విధంగా ఉందో చెప్పొచ్చన్నారు.

**ఉన్నత వ్యక్తిత్వం చంద్రబాబుది..**

చంద్రబాబు సహచరుడు మునిరత్నం నాయుడు మాట్లాడుతూ ఇండియన్ ఎకనామిక్స్ అసోసియేషన్‌లో ప్రతీ ఏటా ఆయన ఉపన్యాసం ఉంటుందని, రాష్ట్రంలో ఏం చేయాలన్నా చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఢిల్లీలో ఉండే యూనివర్సిటీలన్నీ ఏపీలో ఉండాలనే లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారన్నారు. తనకు హాని చేసిన వారిని సైతం పట్టించుకోని ఉన్నత వ్యక్తిత్వం చంద్రబాబుదన్నారు. అనంతరం చంద్రబాబుకు గురువైన మురళీ మాట్లాడుతూ యువతను ఆర్గనైజ్ చేయడంలో చంద్రబాబు చురుగ్గా ఉండేవారన్నారు. ఆయన వర్గం ప్రణాళికాబద్ధంగా పనిచేసేదన్నారు. తమ హక్కుల కోసం పోరాడారే తప్ప యూనివర్సిటీ ఆస్తులకు నష్టం చేయలేదన్నారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మన యూనివర్సిటీలో చదవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన ముందుచూపుతో చేసిన అభివృద్ధి ఫలాలను తెలంగాణ ప్రభుత్వం అనుభవిస్తుందన్నారు. 2047లో ఏపీ అభివృద్ధి సాకారమవుతుందని స్పష్టం చేశారు. వైస్ ఛాన్సలర్ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ ఎస్వీయూ విద్యార్థి గ్లోబల్ లీడర్‌గా ఎదగడం మనమంతా గర్వించదగ్గ విషయమన్నారు. సీఎం దృష్టి 2047 స్వర్ణాంధ్రప్రదేశ్‌పైనే ఉందన్నారు. దానికోసమే పీ-4 విధానాన్ని తీసుకొచ్చారన్నారు. సీఎం మొదటి శిష్యుడు మోహన్ మాట్లాడుతూ ఏపీకి బ్రాండ్ సీఎం చంద్రబాబే అనే స్థితిలో దేశం ఉందని, ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. అలాగే రెడ్డివారి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అనేక కష్టనష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి ఎదిగారని, రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి త్వరలోనే ఫలిస్తుందన్నారు. ఆయన దృష్టి అంతా రాష్ట్రాభివృద్ధిపైనే ఉందన్నారు. సామాన్యుడి కనీస అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో ఆయన శ్రమిస్తున్నారని వివరించారు.

**అతిథులకు సత్కారం..**

సీఎం చంద్రబాబు బాల్యమిత్రులు, సహచర మిత్రులు, గురువులు, శిష్యులను ఒక వేదికపైకి తీసుకొచ్చిన రవినాయుడు ఆలోచన హర్షదాయకమని, ఆయనతో మాకున్న అనుభవాలను పంచుకోవడం సంతోషంగా ఉందని సీఎం స్నేహితులు వివరించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన అతిరథమహారదులందరితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వారందరినీ శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ పూర్వ విద్యార్థులు పాకనాటి హరికృష్ణ, శేషాద్రినాయుడు, పత్తిపాటి వివేక్, రాంబాబు నాయుడు, భువనేష్ చౌదరి, మురళీ మోహన్, బి.ఉదయ్‌కుమార్, చంద్రప్రకాష్, అంజన్ సింగ్, ఉదయ్ భాస్కర్, రంగానాథ్‌బీ ఆనంద్ గౌడ్, మహేష్ యాదవ్, హేమంత్ రాయల్, రంజిత్, రామ్మోహన్, ఆర్.కె.నాయుడు, తోట వాసు, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచిపోయే నాయకుడు నారా చంద్రబాబు నాయుడు: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు75వ పుట్టినరోజు సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి మరియు గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణం నందు ఎన్టీఆర్ సర్కిల్ నందు టీడీపీ కార్యకర్తలు, నాయకులు మధ్యన కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ముందు సభ నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం కనిపిస్తుంది.ఎందుకంటే మన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ తర్వాత మళ్ళీ పార్టీ ని ఆ స్థాయి లో నిలబెట్టి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పని చేసే నాయకుడు మన చంద్రబాబు నాయుడు అన్నారు, రాష్ట్ర ప్రజలకోసం అహర్నిశలు కష్టపడి పని చేసి రాష్ట్ర పరిస్థితి మళ్ళీ గాడిలో పెట్టాలని తపిస్తున్న వ్యక్తి చంద్రబాబు అని తెలిపారు.




ఈరోజు చాలా సంతోషకర రోజు అని ఆయన పుట్టిన రోజు వేడుకలు లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం అని తెలిపారు.ఈ కార్యక్రమం లో గుంతకల్లు పట్టణ, మండల కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిత్తూరు ఎంపీ కార్యాలయంలో ఘనంగా ఏపీ సీఎం చంద్రబాబు గారి పుట్టినరోజు వేడుకలు



**ఏప్రిల్ 20,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరుస్తూ... ఆదివారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సీఎం చంద్రబాబుకు.. చిత్తూరు పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు శ్రీనివాసులు , టిడిపి జిల్లా సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడు రమేష్ , టిడిపి మైనారిటీ సెల్ నగర అధ్యక్షుడు అన్సర్ , కోకో జిల్లా కార్యదర్శి శరత్ , పారిశ్రామిక వేత్త రాకేష్, నాయకులు గజేంద్ర , పవన్ , మహేష్ , గంగాధర్ , సిరాజ్ , కృష్ణ , నూరుద్దీన్, ఎంపీ కార్యాలయం సిబ్బంది, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## డివైఎఫ్ఐ పోరాటాల ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల




**బద్వేల్ ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి న్యూస్)** రాష్ట్రంలో నిరుద్యోగులు ఐక్యంగా అనేక పోరాటాలు చేయడం ద్వారానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సాధ్యమైందని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నోటిఫికేషన్ కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో 30 వేల పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం16,347. పోస్టులు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. స్పెషల్ డీఎస్సీ గురించి రాష్ట్ర ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదని వారు విమర్శించారు. జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు పై రాష్ట్ర ప్రభుత్వం పునర్ ఆలోచించాలని వారు కోరారు. పి ఈ టి పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్ష గడువు 70 రోజులైనా పెంచాలని కోరారు. డివైఎఫ్ఐ పోరాట ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని వారన్నారు. ఈ సమావేశంలో రూరల్ పట్టణ కార్యదర్శి బాల గురయ్యా పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం వేడుకలు....






**ప్రజా జ్యోతి తుగ్గలి** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు తుగ్గలి లో టీడీపీ నాయకులు,ఘనంగా నిర్వహించారు.టిడిపి నేతలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి సంబరాలు చేసుకున్నారు.తుగ్గలి, చెన్నంపల్లి లో తుగ్గలి నాగేంద్ర,బత్తిన వెంకటరాముడు.వెంకటపతి, తిరుపాల్ నాయుడు, మనోహర్ చౌదరి,కొమ్మ వెంకటేష్,మా బాషా, ఈరమ్మ,వల్లే వెంకటేష్,వెంకట్రాముడు చౌదరి,కోటేష్ గౌడ్,రామయ్య,సత్య ప్రకాష్,మధు బాబు,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ముగిసిన రెండు రోజుల స్ఫూర్తి సంఘము కార్యక్రమం

**ఏప్రిల్ 20,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత ప్రచారం కోసం అంకితమైన సంస్కృత భారతి సంస్థ మరియు రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతి సంయుక్తంగా నిర్వహిస్తున్న స్ఫూర్తి సంగమం కార్యక్రమం ముగిసింది. దేశం నలుమూలల నుండి ఈ కార్యక్రమానికి సంస్కృత ప్రచార కార్యకర్తలు తరలివచ్చి, భవిష్యత్తులో సంస్కృత అభివృద్ధికి చేయవలసినటువంటి ప్రణాళికలను చర్చించడం జరిగినది. ఈ సమాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారతీయ సంఘ కార్యవాహ్ సురేష్ సోని విచ్చేసి సంస్కృత భాష యొక్క ఆవశ్యకత, ఆధునిక కాలంలో సంస్కృతం భారతీయ సభ్య సమాజానికి ఒక మంచి మార్గాన్ని నిర్దేశించేటువంటి దిక్సూచి అని, సంస్కృతాన్ని ప్రతి ఒక్కరూ చదువుకొని అందులో ఉన్నటువంటి జ్ఞానాన్ని పొందాలని సూచించారు. అనంతరం సంస్కృత భారతి అఖిల భారతీయ అధ్యక్షులు ప్రొ. గోపబంధు మిశ్రా మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి ఒక్కరికి సంస్కృతాన్ని చేర్చాలి అనే సదుద్దేశంతో సంస్కృత భారతి పనిచేస్తుందని తెలియజేశారు. అనంతరం సంస్కృత భారతీ అఖిల భారతీయ సంఘటన మంత్రి జయప్రకాశ్ గౌతమ్ మాట్లాడుతూ సంస్కృత భారతి దేశంలో సంస్కృత భాష అభివృద్ధికి అహర్నిశం పనిచేస్తుందని సూచించారు. అనంతరం కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ వైస్ ఛాన్సర్ ప్రొ. శ్రీనివాస వర్కేడి మాట్లాడుతూ భారత దేశ ప్రభుత్వం ద్వారా సంస్కృత భాష అభివృద్ధికి వివిధ రకాలైనటువంటి పథకాలను ఏర్పాటు చేసి తద్వారా స్కూల్ లెవెల్ నుండే సంస్కృత అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు కూడా సంస్కృతం నేర్చుకుని భారతీయ సంస్కృతిని సంరక్షించాలని సూచించారు.




అనంతరం ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వి.సి ఆచార్య జి ఎస్. ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ రెండు రోజుల సమావేశం ద్వారా సంస్కృతాన్ని ఏ విధంగా భవిష్యత్తులో ముందుకు తీసుకువెళ్లాలి? ఆధునిక కాలంలో ప్రతి రంగంలో సంస్కృతం యొక్క అవసరతను చర్చించి, ఆ దిశగా ముందుకు వెళ్లాలని ఆలోచన చేయడం జరిగినది. సంస్కృతంలో ఉన్నటు వంటి వైజ్ఞానిక తత్వాలను ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యార్థులకు, పరిశోధకులకు మరియు ప్రజానీకానికి అందించాలని నిశ్చయించడం జరిగింది. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం తరపున నిర్వహించడం ఆనందదాయకమని ఆయన హర్షాన్ని వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయం తరుపున ఈ యొక్క కార్యక్రమం అంతటి కోఆర్డినేటర్గా అనువాద విభాగ అధ్యాపకులు డా.ఎం.జి. నందన్ రావు ఎడ్యుకేషన్ విభాగ అధ్యాపకులు డా.ఎస్.ఎల్ సీతారాం శర్మ అన్ని విషయాలను చక్కగా కోఆర్డినేట్ చేసుకుంటూ దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది.

# చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను.






ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

పాలకొల్లు. ప్రజా జ్యోతి (కొట్టి రామం )ఏప్రిల్ 20. నవ్యాంధ్ర సృష్టికర్త, పరిపాలన దక్షత కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో మంత్రిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను పాలకొల్లులో మంత్రి కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం ఘనంగా జరిపారు నియోజకవర్గ నాయకులు కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు చంద్రబాబు పుట్టినరోజు కేకును కట్ చేశారు. అనంతరం పేదలకు బియ్యం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన దాతలను మంత్రి నిమ్మల అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. త్రాగునీరుకు సాగునీరుకు లోటు లేకుండా పోలవరం ప్రాజెక్టు రూపుదిద్దుకుంటున్నద న్నారు. ఆంధ్రప్రదేశ్ ను కరువు రహిత రాష్ట్రంగా మార్చాలన్నది చంద్రబాబు లక్ష్యమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 16,137 మంది ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తున్నామని మత్స్యకారులకు వారి ఖాతాలో 20000 జమ చేయడం జరుగుతుందని అన్నారు. మే నెలలో రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకంలో రూ 20000 అందిస్తామన్నారు. తల్లికి వందనం పథకం లో ప్రతి విద్యార్థికి పాఠశాలలు తెరిచిన తరువాత అందజేస్తామన్నారు. గతంలో ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రాక్షస పాలన కొనసాగించారన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి ఉంటే రాష్ట్రాన్ని ఎడారిలా మార్చి ఉండే వారన్నారు. ప్రధానమంత్రి మోడీ జనసేన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి త్రిమూర్తులు లా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ బిజెపి నాయకులు ఉన్నమట్ల కపర్థి, జక్కంపూడి కుమార్ జనసేన నాయకులు తులా రామలింగేశ్వర రావు నియోజకవర్గ టిడిపి నాయకులు కోడి విజయభాస్కర్ పెచ్చెట్టి బాబు పీతల శ్రీనివాస్ గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు పాలవలస తులసిరావు దేవరపు దొరబాబు మామిడి శెట్టి పెద్దిరాజు పోడూరు, యలమంచిలి పాలకొల్లు మండల, పట్టణ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు జన్మదిన సందర్భంగా భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ






-ఉచిత మెగా వైద్య శిబిరం.
-పరిపాలనా దక్షుడు రాజకీయ దురంధరుడు.
-రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు లక్ష్యం.:
- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి.



**పాతపట్నం, ఏప్రిల్ 20: ప్రజా జ్యోతి న్యూస్...** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి వేడుకలలో భాగంగా ముందుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి నీలమణి దుర్గ అమ్మవారి గుడి వరకు సుమారు 1000 బైక్ లతో భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం నీలమణి దుర్గ ఆలయంలో 108 కొబ్బరికాయలను కొట్టి చంద్రబాబు నాయుడు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వృద్ధులకు, వికలాంగులకు, యాచకులకు వస్త్రాలను పంపిణీ చేసి పాతపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో రోగులకు పండ్లు,రొట్టెలను పంపిణీ చేశారు అదేవిధంగా సుమారు 500 మందికి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగింది ఈ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సుమారు 2000 మందికి పైగా కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సామాన్యులకు,బడుగు బలహీన వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా అవకాశాలు కల్పించిన ఏకైక పార్టీ దేశంలో ఏదైనా ఉందా అంటే అది ఒక తెలుగుదేశం పార్టీనే అని కొనియాడారు అలాగే సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన నాలాంటి వానికి గుర్తించి గౌరవించి టికెట్ ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించిన ఘనత తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తో పాటు పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,నాయకులు అభిమానులే కారణమని తెలియజేశారు పాతపట్నం నియోజకవర్గం నాయకులకు, కార్యకర్తలకు,అభిమానులకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చారు ఈ జన్మదిన వేడుకలకు 5 మండలాలకు చెందిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,ప్రజలు, భారీగా హాజరయ్యారు..

## టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు






**బద్వేల్ ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి న్యూస్)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవం సందర్భంగా మైదుకూరు రోడ్డు అన్న క్యాంటీన్ వద్ద ఉన్న చలివేంద్రం దగ్గర టిడిపి యువనేత రితేష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ చేతుల మీదుగా అల్పాహారం మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వెంగల్ రెడ్డి, మిత్తికాయల రమణ, సీనియర్ న్యాయవాది ప్రసాద్, బిజీ వేముల సుధాకర్ రెడ్డి, కనుమల్ల పూటీ ప్రసాద్, కృష్ణారెడ్డి, నాయుడు, మస్తాన్ బాబు. మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి. టీవీఎస్ రవి. లకిడి విజయభాస్కర్ తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



**తూర్పుగోదావరి జిల్లా , తాళ్లపూడి మండలం,ఏప్రిల్20 ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండల పరిధిలో పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకను పురస్కరించుకొని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు వారి పితరుల సమాధుల వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు తాడిపూడి గ్రామంలో ఐక్యత ప్రార్థన మందిరంలోపాస్టర్ ఏ.కృపారావుమాట్లాడుతూ శుభశుక్రవారం రోజున శిలువ శ్రమను, శిలువ మరణమును అనుభవించి, మూడవ దినము ఆదివారం నాడు మరణమును జయించి క్రీస్తుపునరుత్థానుడుఅయ్యారని అన్నారు. ఆయన తన రక్తములతో పాపాలను కడిగి క్షమాగుణాన్ని అందించారని అందరం కూడా ప్రభువు చూపించిన మార్గాన్ని అనుసరిస్తూ నడవాలని సంఘ సభ్యులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలోసంఘవిశ్వాసులు యూత్ సభ్యులు పాల్గొన్నారు

## విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



**బద్వేల్ ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ నియోజకవర్గం శ్రీ అవధూత కాశినాయన మండలంలోని వరికుంట్ల కస్తూరిబా బాలికల పాఠశాల నందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టిడిపి నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల తో కలసి ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజరయ్యారు. విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.. గత వారంలో పాఠశాల భవనాల శంకుస్థాపనకు వచ్చినటువంటి ఇంచార్జ్ రితీష్ కుమార్ రెడ్డిని పాఠశాల ప్రిన్సిపల్ రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కావున తమరు ఇన్వెటర్ ఏర్పాటు చేయాలని కోరడంతో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు సందర్భంగా ఇన్వెటర్ అందించారన్నారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి సారథి సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను విద్యార్థులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువ నాయకుడు రితీష్ రెడ్డి ఆధ్వర్యంలో కస్తూరిబా పాఠశాలలో దాదాపు రూ. 2 కోట్ల నిధులతో భవనాలను మంజూరు చేశారన్నారు. గత 5 సంవత్సరాల్లో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి సొంత గ్రామమైనటువంటి వరికుంట్ల కు ఏమి చేశారని ప్రశ్నించారు.. మంత్రి నారా లోకేష్ గారు ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాల కన్న దీటుగా ఉండాలనే సంకల్పంతో పాఠశాలలను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళుతున్నాడు అన్నారు.. రాష్ట్ర అభివృద్ధి. కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, టిడిపి నాయకులు రాజారెడ్డి,పాలిరెడ్డి, రామ సుబ్బారెడ్డి, సీతా వెంకటసుబ్బయ్య, గురివిరెడ్డి, విజయ కుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**ప్రజా జ్యోతి తుగ్గలి,** మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ లలో ఆదివారము రౌడీషీటర్లకు ఎస్సైలు కృష్ణమూర్తి, మల్లికార్జునులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు రౌడీషీటర్లు దూరంగా ఉండాలన్నారు. నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు




**తూర్పుగోదావరి జిల్లా , తాళ్లపూడి మండలం,ఏప్రిల్20 ప్రజాజ్యోతి న్యూస్** స్వర్ణాంధ్ర నిర్మాత తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా తాళ్లపూడి మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు తాడిపూడి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి నామా శ్రీరాములు సమక్షంలో నామాకొండబాబు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా భారీ కేక్ కట్ చేసి, జై చంద్రబాబు అంటూ నినాదాలు చేసి బాణాసంచాకాల్చిఅంగరంగ వైభవంగా జన్మదిన వేడుకని జరిపారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దీర్ఘాయుష్మతోరాష్ట్రాన్ని పరిపాలించాలని దార్శినికతతో అమరావతి ,పోలవరం నిర్మాణం పూర్తయ్యే విధంగా ఆయనకు శక్తిని ఆ భగవంతుడు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమం లో జిల్లా తెలుగు యువత నాయకులు నామా. సురేంద్ర కుమార్, సిద్దన రాధాకృష్ణ, కూటమి నాయకులు,యూత్ కార్యకర్తలు పాల్గొన్నారు మండల కేంద్రమైన తాళ్లపూడిలో టీడీపీ మండల అధ్యక్షులు నామన పరమేశ్వర అధ్యక్షతన చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నామన రవి, గుండుబోగుల ప్రసాద్,నాగు నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు గజ్జరం గ్రామంలో కాకర్ల వంశీ, దండమూడి శేషు, కొర్లపాటి లక్ష్మణరావు , గన్నిన సత్తిబాబు,ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో లాడ్జిలు,హోటళ్ళు విస్తృత తనిఖీ

**జిల్లాలో 32 పోలీస్ స్టేషన్ ల పరిధిలోని 75 హోటళ్లు, లాడ్జి ల తనిఖీలు..**
**అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందు ఈ తనిఖీలు..**
**చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ తుషార్ దూడి హెచ్చరిక..**




**బాపట్ల, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లాలో పోలీసులు లాడ్జిలు హోటళ్ళు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శనివారం రాత్రి 9 గంటల నుండి 10 గంటల వరకు జిల్లాలోని లాడ్జిలు, రిసార్ట్స్, హోటళ్లు, రెస్టారెంట్లు, దాబా లను ఆకస్మికంగా తనిఖీలు చేసి విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి గదులను తనిఖీ చేశారు. బస చేయడానికి వచ్చే వారి గుర్తింపు కార్డులు తనిఖీ చేసుకొని వారి వివరాలను రికార్డులో సక్రమంగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులను, పోలీస్ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరాలకు, బెట్టింగ్ లకు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిని గుర్తించి, అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసే ఉద్దేశంతో జిల్లాలోని లాడ్జిలు, హోటల్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు, దాబాలను పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీ చేశారన్నారు. జిల్లాలోని 32 పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న 75 లాడ్జిలు రిసార్ట్స్ హోటళ్లను పోలీసు అధికారులు తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలలో కానిస్టేబుల్ నుండి డిఎస్పి స్థాయి అధికారుల వరకు పాల్గొన్నారన్నారు. నేరాలకు పాల్పడేవారు, బెట్టింగ్ లు నిర్వహించే వారు, గంజాయి సేవించే వారు, ఇతర పలు అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు సహజంగా తాత్కాలిక ఆవాసం కోసం వీటిని ఎంచుకుంటారన్నారు. అటువంటి వారి కార్యకలాపాలను కట్టడి చెయ్యాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ తనిఖీలను చేసినట్లు చెప్పారు. హోటల్లు లాడ్జిలు రిసార్ట్స్ లలో తాత్కాలికంగా బస చేయడానికి వచ్చే వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసి వారి వివరాలను రికార్డులలో నమోదు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించినట్లు చెప్పారు. రెస్టారెంట్లు దాబాలలో ఇతర ప్రదేశాలలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ లు ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు గురించిన సమాచారం సంబంధిత పోలీసులకు అందించాలని (లేదా) డయల్ 100,112 నెంబర్ లకు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

# ప్రేలుడు పదార్థాలు స్వాధీనం : బాపట్ల డిఎస్పి



**బాపట్ల, ఏప్రిల్ 20 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** నిల్వ ఉంచిన ప్రేరుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 20 లక్షల రూపాయలుగా బాపట్ల డిఎస్పి రామాంజనేయులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామ పొలాల్లో నాగ వేణుగోపాల్ కు చెందిన ప్రేలుడు పదార్థాలు స్టాక్ ఉంచే మ్యాగ్జిన్ లో అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ ఉంచిన 20 లక్షలు విలువైన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని హనుమంతరావు అనే వ్యక్తిని మార్టూరు ఇన్స్పెక్టర్ శేషగిరిరావు అరెస్ట్ చేసినట్లు డిఎస్పి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను మార్టూరు పోలీస్ స్టేషన్లో ఆదివారం బాపట్ల డిఎస్పి రామాంజనేయులు మీడియాకు వెల్లడించారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదేశాల మేరకు డి.ఎస్.పి రామాంజనేయులు సూచనలతో మార్టూరు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శేషగిరిరావు సిబ్బంది బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని నాగరాజుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో మిడాల నాగ వేణుగోపాల్ ప్రేలుడు పదార్థాలు స్టాక్ ఉంచే మ్యాగ్జిన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ దాసం హనుమంతురావును అదుపులోకి తీసుకొని విచారించగా మ్యాగ్జిన్ లైసెన్సు దారుడిగా మిడాల నాగ వేణుగోపాల్ అని తెలిసింది. అయితే లైసెన్సు వ్యాలిడ్ ఈ ఏడాది మార్చి వరకే ఉంది. మిడాల నాగ వేణుగోపాల్ వద్ద నుండి దాసం హనుమంతురావు సబ్ లీజుకి తీసుకొని కొన్ని సంవత్సరాలు నుండి వ్యాపారము చేస్తూ చుట్టుప్రక్కల గ్రానైటు క్వారీలలో ముడి రాళ్ళు పగలకొట్టడానికి ఉపయోగించే మందుగుండు సామాగ్రి, ప్రేలుడు పదార్థాలు అయిన జెలిటెన్ స్టిక్స్, ఎలక్ట్రికల్ డిటోనేటర్, ఆర్డినరీ డిటోనేటర్ డిటోనేటర్ ఫ్యూజ్ వైర్స్ వంటి సామగ్రిని విక్రయిస్తున్నాడు. వాటిని తెలంగాణా రాష్ట్రం , మేడ్చల్ జిల్లా లోని, కీసర మండలం, అంకిరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న సాల్వో ఇండస్ట్రీస్ కంపెనీ నుండి కొనుగోలు చేసి, వాటిని రవాణా చేసేందుకు స్వంత వాహనాలు ద్వారా నాగండ్ల ప్రసన్న సహాయముతో మ్యాగ్జిన్ లోఅక్రమంగా స్టాక్ పెట్టి, వాటిని లైసెన్సు ఉన్న క్వారీ, క్రషర్ మరియు లైసెన్సు లేని గ్రానైటు క్వారీ, క్వారీ క్రషర్ వారికి, ఇతరులకు ఎక్కువ ధరకు అమ్ముకొని లాభాలు గడిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పైన తెలిపిన వ్యక్తులు అక్రమ ప్రేలుడు పదార్థాలను కలిగి ఉండి వాటిని ఎలాంటి బిల్లులు అదే విధముగా నాగరాజుపల్లి గ్రామ పరిధిలో గల ప్రేలుడు పదార్థాలు కలిగిన స్టాక్ మ్యాగ్జిన్ లో నిల్వ ఉంచిన స్టాక్ వివరాలు వ్యత్యాసము కలిగి ఉన్న నేపథ్యంలో హనుమంతరావు ను అరెస్టు చేసినట్టు డిఎస్పి తెలిపారు. ఈ క్రమంలో ప్రేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు.

# ముఖ్యమంత్రి చంద్ర బాబుకు ఎవరు సాటిరారు

**బాపట్ల ఎమ్మెల్యే వేగేశన...**

**బాపట్లలో ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 75 వ జన్మదిన వేడుకలు.**





**బాపట్ల, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనకు ఆయనే సాటి అని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించే బాబుకు ఎవరు సాటి రారని ఎమ్మెల్యే వేగేసిన అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆయన పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమందికి పదవులు అలంకారమైతే, చంద్రబాబు పదవికె అలంకారమని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గాని విభజిత ఆంధ్రలో గాని నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత చంద్రబాబుదని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్ రెడ్డి,బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా బ్రాహ్మణ దంపతులకు వస్త్రాలు వెండి నాణ్యాలు పంపిణీ చేసిన డాక్టర్ జి ఎన్ వెంకటేష్, డాక్టర్ పత్తి హిమబిందు దంపతులు ఆంధ్ర రాష్ట్ర



గుంతకల్లు ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా గుంతకల్లు సాయి కృష్ణ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ జి ఎన్ వెంకటేష్ మరియు డాక్టర్ పత్తి హిమబిందు దంపతులు బ్రాహ్మణ దంపతులకు వస్త్రాలు మరియు వెండి నాణెములు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి నారా లోకేష్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి,లోకేంద్రనాథ్,నారాయణ, కదిరప్ప,జనసేన నాయకులు అరికెర జీవన్,సురేష్,రవి తేజ,ఆంధ్ర రాష్ట్ర బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు లోకనాథ్ స్వామి మరియు వేద పండితులు వారి సతీమణులు పాల్గొన్నారు. వేద పండితులు చంద్రబాబు నాయుడు కి వేద ఆశీర్వచనం అందించారు.

## కిడ్నాప్ అయినా 8 ఏళ్ల చిన్నారిని రక్షించిన గుంతకల్లు రైల్వే పోలీసులు



గుంతకల్లు ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి):కర్ణాటక రాష్ట్రంలోని బిట్టగెరి, గదగ్ కి చెందిన రొకీయ అనే 8 సంవత్సరాలు చిన్నారి కిడ్నాప్ అయినటు వంటి చిన్నారిని గుంతకల్లు రైల్వే స్టేషన్ లో రైల్వే పోలీసులు సిబ్బంది. హంపి రైల్లో ట్రైన్. నెంబర్ 16591 నుండి గుంతకల్లు రైల్వే స్టేషన్లో 19వ తేదీ శనివారం రాత్రి విధులు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు రాత్రి 11:50 గంటలకు. నిగా బెట్టి చిన్నారిని గమనించి గుంతకల్లు రైల్వే స్టేషన్ లో.దింపడం అయినది. 20వ తేదీ ఆదివారం ఉదయాన్నే 05:20. గంటలకు బిట్టగెరి పోలీస్ స్టేషన్ గధగ్ ఎస్ఐ వారి సిబ్బందికి ఆ చిన్నారి తండ్రి అలీ రియాజ్, తల్లి కుబేర అప్పగించడమైనదని జి ఆర్ పి ఎఫ్ ఎస్ఐలు మహేంద్ర, బి.వెంకటరమణ, జి ఆర్ పి ఏఎస్ రవిశంకర్, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ.మురళి, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ. వెంకటేశ్వర్లు,లింగేసా పిసి జీఆర్పి బళ్ళారి తెలిపారు.

## పైడితల్లమ్మ పండుగ నిర్వాహణకు విరాళాలు సేకరణ

**– పూర్తిస్థాయిలో నిమగ్నమైన పండుగ కమిటీ సభ్యులు**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్:** శ్రీ పొందూరు పైడితల్లి అమ్మవారి పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు పైడితల్లి అమ్మవారి పండుగ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు పండుగ నిర్వహణ నిమిత్తం గత మూడు రోజులుగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం నిర్వహించిన విరాళాల సేకరణ కార్యక్రమంలో పలువురు దాతలు పండుగ నిర్వహణలో తన వంతు సహకారంగా ఆర్థిక సహాయం అందజేశారు. ప్రతీ ఒక్కరూ ఇదే విధంగా పండుగ నిర్వహణ లో భాగస్వామ్యులు కావాలని పండుగ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మీ , జామి వెంకట రమణ ( జెవీఆర్ ), అనకాపల్లి శ్రీనివాస రావు , అనకాపల్లి శివ కుమార్ , రాంబిల్లి నాగరాజు ,మొకర సత్యన్నారాయణ (ఎం.ఎస్.ఎన్ ), గాడు నాగరాజు ,గుడ్ల మోహన్ ,మొగదాల రమణ రావు , కోరుకొండ విజయకుమార్, గుంటుకు రాము ,,యర్రా సతీష్ , కాలేపు శ్రీనివాస రావు ,మల్లిక భుజంగ రావు , , ఆనేం పాపారావు , మాసాడ భోగరాజు ,అనకాపల్లి చిన్న , అనకాపల్లి భవాని , అట్ల చంద్ర శేఖర్,పసుపు రెడ్డి శ్రీనివాస రావు , సాయి చైతన్య , పాత్రికేయులు రాయిపిల్లి రాంబాబు ,కనకల జన, గిడిజాల భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు

## మల్లిరెడ్డి వారి వివాహ వేడుకలో పాల్గొన్న మురళిరాజు



**కాకినాడ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు మండలం వెంకటనగరం గ్రామంలో మల్లిరెడ్డి నాగేంద్ర కుమార్తె వివాహ వేడుకకు ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు హాజరై వధూవరులను ఆచరించారు
ఈ కార్యక్రమంలో వెంకటనగరం సర్పంచ్ బాబీ నూకరాజు బొల్లు నాగేశ్వరరావు జువ్వల దొరబాబు యాళ్ల ఏసు జువ్వల రాజు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం ఆరబెట్టేందుకు నానా అవస్థలు



**చౌటుప్పల్ :** చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని శనివారం రైతులు ఆరబెట్టారు. రోజంతా మబ్బులు కమ్ముకొని ఉండడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానా అవస్థలు పడవలసి వచ్చింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం రాశుల కిందకు నీరు చేరు కుంది. సీసీ కల్లం పై పోసిన సుమారు 50 మంది రైతులకు చెందిన ధాన్యం రాశులు తడిశాయి. వాన నీరు రాశుల కిందకు చేరడంతో ఈ పరిస్థితి నెలకొంది. అందులో 10నుంచి 15మంది రైతులకు చెందిన ధాన్యం రాశులు ఎక్కువగా తడిసి పోయాయి. ఐదారుగురి రైతుల కు చెందిన ధాన్యం వాన నీటిలో కొంత దూరం కొట్టుకు పోయింది. ఇదంతా కూడ సీసీ కల్లంపై రాశులు పోసిన ధాన్యం పరిస్థితి. గత పది సంవత్సరాల నుంచి రెండు సీజనలలో వచ్చే ధాన్యాన్ని రైతులు మార్కెట్ యార్డుకు తీసుకురావడం, వర్షాలు కురిసి తడిసిపోవడం ప్రతి సారీ జరుగుతున్న ఒక తంతుగా మారింది. సీసీ కల్లంపై పోసిన ధాన్యం రాశులకే ఈ సమస్య ఎదురవుతోంది తప్ప మిగతా ధాన్యం రాశులకు వానతో పెద్ద సమస్య రావడం లేదు. మండలంలోని ఇతర కొనుగోలు కేంద్రాల్లో కూడా ధాన్యం రాశులు వర్షాలు కురిసినా సురక్షితంగా ఉంటున్నాయి. కొన్ని గ్రామాలకు చెందిన రైతులు పోటీలు పడి యార్డులోని సీసీ కల్లంపై ధాన్యం పోయడం, వర్షాలు కురిస్తే ధాన్యం రాశులు తడిసి పోవడం ఒక రివాజుగా మారింది. వర్షాలు కురియకుంటే మాత్రం సీసీ కల్లం పై పోసిన ధాన్యం శు భ్రంగా ఉంటుంది. ధాన్యాన్ని శుభ్రం చేయడానికి అనువుగా ఉంటుంది. తరుగు రాదు. మట్టిలో కలవదు. యార్డులో మొత్తం 118 మంది రైతులకు చెందిన ధాన్యం రాశులు ఉన్నాయి. సీసీ కల్లం లేని ప్రాంతంలో టార్పాలిన కవర్‌లు వేసుకుని పోసిన ధాన్యం రాశులు సురక్షితంగా ఉండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

**నామా మాత్రంగా ధాన్యం తూకాలు**

చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం రెండవ రోజు కేవలం ఇద్దరు రైతులకు చెందిన 480 బస్తాల ధాన్యాన్ని మాత్రమే తూకం వేయించారు. మొదటి రోజు ముగ్గురు రైతులకు చెందిన 650 బస్తాల ధాన్యాన్ని తూకాలు వేయించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రంలో హమాలీల సంఖ్య చాల తక్కువగా ఉండడంతో తూకాలకు ఒకే ఒక్క కాంటాను మాత్రమే ఉపయోగించారు. దీంతో మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని కూడా పీఏసీఎస్ సిబ్బంది తూకాలను వేయించలేకపోతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

**తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి**

అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఆరుగాలం కష్టించి పండించిన పంట వరద నీటిలో కొట్టుకుపోవడంతో గుండెలు పగిలిపోయాయి. ధాన్యాన్ని తూకాలు వేసేంత వరకు నమ్మకం లేని పరిస్థితి ఏర్పడింది. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పంట చేతికి వచ్చేంత వరకు గ్యారంటీ లేదు.

**1000 టార్ఫాలిన కవర్లను ఇప్పించాలి**

చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కు 1000 టార్పాలిన కవర్లను ఇప్పించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ జి.వీరారెడిని ఏఎంసీ చైర్మన ఉబ్బు వెంకటయ్య కోరారు. భువనగిరిలోని ఆయన కార్యాలయంలో శనివారం అడిషనల్ కలెక్టర్‌ను చైర్మన వెంకటయ్య కలిశారు. టార్ఫాలిన కవర్‌లు తగినన్ని లేక పోవడంతో వర్షాలు కురిసినప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రాశులపై కప్పేందుకు కవర్‌లు లేక పోవడంతో ధాన్యం తడిసి పోయే అవకాశాలు ఉన్నాయని చైర్మన వివరించారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఒక వెయ్యి టార్ఫాలిన కవర్ లను ఇచ్చించాలని ఆయన కోరారు. అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని మ్యాచర్ నిబంధన లేకుండా కొనుగోలు చేయించాలని, ధాన్యం తూకాలకు కొరత లేకుండా గన్నీ బ్యాగులను సరఫరా చేయించాలని కోరారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ కు ఏఎంసీ చైర్మన వెంకటయ్య వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ఇనచార్జ్ పబ్బు రాజు, ఏఎంసీ డైరెక్టర్‌లు ఎండీ.గౌసఖాన, పబ్బు శ్రీకాంత, మొగుదాల రమేష్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు. అంతకు ముందు చౌటుప్పల్‌లోని మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని అన్నారు. రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# గురుకులాలకు ఏడు నెలలుగా బకాయిలు



**కోదాడ :** బడుగు, బలహీన విద్యార్థులకు విద్యను దగ్గర చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీ, సాధారణ గురుకులాలు ఏర్పాటుచేసింది. ఫలితంగా పేద విద్యార్థులు గురువుల వద్ద ఉంటూ, సహజ వాతావరణంలో జీవిస్తూ, విద్యాభ్యాసం తో పాటు తోటి విద్యార్థులతో స్నేహభావం, వ్యక్తిగత నైపుణ్యం, జ్ఞానంతో పాటు నైతిక విలువలు అలవర్చుకొని జీవితంలో రాణిస్తారనేది ప్రభుత్వ తలంపు. ఈ క్రమంలో కొన్నిచోట్ల సొంత భవనాల్లో, మరికొన్ని చోట్ల అద్దె భవనాలలో విద్యను అందిస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 82 గురుకులాలు ఉంటే వాటిలో 55 భవనాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నా యి. గత ఏడు నెలలుగా వాటికి సుమారు రూ.13.47 కోట్ల అద్దె సొసైటీ వారు చెల్లించకపోవటంతో భవన యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి సమస్య వచ్చినా భవన యజమానులు పట్టించుకోవటంలేదు. దీంతో మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు ఇబ్బందు లు పడుతున్నారు. అంతేగాక 82 గురుకులాల్లో పనిచేస్తున్న 3,280మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి, గత నెల జీతం రూ.26.24 కోట్లు నేటికి అందకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదనేది సమాచారం. గత ఏడు, ఎనిమిది నెలలుగా, నెలనెలా జీతాలు సక్రమంగా అందక ఉపాధ్యాయులు సైతం ఇబ్బందులుపడుతున్నట్లు సమాచారం. ఈ విద్యాసంవత్సరం పూర్తి అయ్యే నాటికి గురుకులాల అద్దెలు, వాటిలో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ జీతాలు ఇచ్చి, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపు సొంత భవనాలు నిర్మించాలని, నెలనెలా జీతాలు ఇచ్చి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని ఉపాధ్యాయులు సొసైటీ నిర్వాహకులను కోరుతున్నారు.

**సగానికిపైగా అద్దె వాటిలోనే..**

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ గురుకులాలు 18 ఉన్నాయి. వాటిలో ఎనిమిది అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. బీసీ 26 ఉండగా, 26 అద్దె భవనాల్లో, ఎస్టీ గురుకులాల 20 ఉండగా, వాటిలో 5 అద్దె భవనాల్లో, మైనార్టీ 16ఉండగా వాటిలో 11 అద్దె భవనాలలో నడుస్తున్నాయి. సాధారాణ గురుకులాలు రెండు ఉండగా, రెండింటికీ సొంతభవనాలు ఉన్నాయి. మొత్తంగా 82 గురుకులాలు ఉండగా, వాటిలో 55 గురుకులాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. ఒక్కో భవనం అద్దె సగటున రూ.3.50 లక్షలు ఉన్నట్లు సమాచారం. ఆ చొప్పున 55 గురుకులాలకు చెల్లించాల్సిన అద్దె నెలకు రూ.1.92 కోట్లు. ఏడు నెలలుగా బకాయి మొత్తం రూ.13.47 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. మైనార్టీ గురుకులాలకు 11 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. అంటే మైనార్టీ గురుకులాలకు మరో నాలుగు నెలల అద్దె రూ.14లక్షలు ఇవ్వాల్సి ఉంది. విద్యాసంవత్సరం పూర్తవుతున్నా అద్దెలు అందకపోవటంపై భవన యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈఎంఐలు ఎక్కడ నుంచి తెచ్చి కట్టాలని వారంటున్నారు. కోట్లు పెట్టి భవనాలు నిర్మిస్తే, ప్రభుత్వం నెలవారీగా అద్దెలు చెల్లించకపోవటంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా బకాయిలు ఇచ్చి, నెలనెలా అద్దెలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**అందని రూ.26 కోట్ల వేతనాలు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 82 గురుకులాల్లో 52,480మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో గురుకులంలో 32 మంది టీచింగ్, ఎనిమిది మంది నాన్‌టీచింగ్, మొత్తం 40 మంది పనిచేస్తున్నారు. ఆ చొప్పున 82 గురుకులాల్లో 3,280 మంది పనిచేస్తున్నారు. గత నెల వరకు వారికి జీతాలు రూ.26 కోట్లు అందాల్సి ఉంది. ఈ నెల 20 రోజులు గడుస్తున్నా మార్చి నెల జీతం నేటికీ అందకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నుంచి నెలనెలా జీతాలు అందడంలేదని రెండు, మూడు నెలలకు ఒకసారి వస్తుండటంతో పస్తులతో తాము పనిచేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, సౌకర్యాలు అందాలంటే సిబ్బందికి నెలనెలా జీతం అందేలా, సొసైటీ వారు ప్రణాళిక సిద్ధం చేసుకొని, వచ్చే విద్య సంవత్సరంలోనైనా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు కోరుతున్నారు.

**2008 డీఎస్సీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకూ అందని వేతనాలు**

2008 డీఎస్సీ కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా నియమితులైన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 157 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం గత ఫిబ్రవరి 15న కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించింది. వీరికి రూ.31వేల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉండగా, ఉద్యోగంలో చేరి రెండునెలలైనా వేతనాలు ఇంకా అందలేదు. ఉద్యోగంలో చేరక ముందు ప్రైవేట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీస్తుండగా, రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఉద్యోగంలో చేరామని వారు సంబరపడ్డారు. అయితే ఉద్యోగంలోకి చేరాక వేతనాలు అంద కపోవడంతో వారి సంతోషం ఆవిరైంది. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకుని వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

# క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడు మృతి

**మేడ్చల్ జిల్లా:** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. రాంపల్లి దాయరలో క్రికెట్ ఆడుతూ క్రికెట్ గ్రౌండ్‌లోనే ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. క్రికెట్ ఆడుతూ గ్రౌండ్‌లోనే కుప్పకూలిపోయాడు. మృతుడిని ఓల్డ్ బోయినపల్లి చెందిన ప్రణీత్(32)గా గుర్తించారు. మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది. గత వారం రోజుల క్రితం కూడా రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ప్రశాంత్‌కు శనివారం ఫిట్స్ రావడంతో అంబులెన్స్‌లో సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న ప్రశాంత్ గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఇటీవలే కొన్నిరోజుల క్రితం...గుజరాత్‌లో ఓ ఎనిమిదేళ్ల బాలిక తరగతి గది కారిడార్‌లో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో విగతజీవిలా కిందకు వాలిపోవడం స్కూల్ సీసీటీవీలో రికార్డయింది. కాగా, ఈ మధ్యకాలంలో గుండెపోటుతో హఠాత్ మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్నా-పెద్దా, పురుషులు-మహిళలు,



ధనవంతుడు-పేదవాడు అనే తారతమ్యాలు, వయసు తేడాలు లేకుండా ఏడెనిమిదేళ్ల లోపు చిన్న పిల్లలు మొదలు 18-25 ఏళ్ల మధ్య యువజనులు, శారీరకంగా ధృడంగా ఉండే రాజకీయవేత్తలు, కసరత్తులు చేసి ఫిట్‌గా ఉండే క్రీడాకారులు, అప్పటిదాకా ఎలాంటి గుండెజబ్బు ఆనవాళ్లు లేనివారు కూడా అకస్మాత్తుగా వచ్చే హార్ట్ ఎటాక్, కార్డియక్ ఫెయిల్యూర్లతో నేలకొరుగుతున్నారు.

## వెన్నా శివ ఆధ్వర్యంలో ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు





**కాకినాడ ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ప్రత్తిపాడు,** భవిష్యత్తు తరాల అవసరాలను,భవిష్యత్తు తరాలకు కావాల్సిన అభివృద్ధిని ముందుగానే అందించే దార్శనికుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని రాష్ట్ర టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్నా శివ అన్నారు.కత్తిపూడి టిడిపి కార్యాలయంలో జరిగిన సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో టిడిపి శ్రేణులతో కలిసి ఆయన పాల్గొని భారీ కేక్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు.పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం చంద్రబాబు నాయకత్వాన్ని కొనియాడిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు.సంక్షేమంలో గానీ అభివృద్ధి గానీ,యువతకు ఉపాధి,ఉద్యోగ కల్పనలో గానీ చంద్రబాబుకు ఎలాంటి పోటీ లేదన్నారు.ఉమ్మడి రాష్ట్రాన్ని కానీ,విభజిత ఆంధ్రప్రదేశ్ ను కానీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లింది చంద్రబాబు నాయుడు మాత్రమే అని తెలిపారు.ఆయన వయసు 75 సంవత్సరాలు గాని చంద్రబాబు ఆలోచనా విధానంలో,పనితనంలో నవ యువకుడు నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బద్ది రామారావు,మాజీ ఎంపీటీసీ సాదనాల లక్ష్మిబాబు తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పేరవరం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు...



**అన్నవరం ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** ప్రత్తిపాడు శాసన సభ్యులు వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు పేరవరం గ్రామంలో ఎన్డీఏ నాయకులు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు జన్మదిన వేడుకలు నిర్వహించి,శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పేరవరం టీడీపీ గ్రామ రథసారధి కర్రి సూర్యప్రకాష్ రావు మాజీ ఎంపిటిసి కర్రి సుబ్బారావు జనసేన గ్రామ నాయుకులు గ్రామ పంచాయితీ మాజీ వార్డ్ సభ్యులు దేగల సత్యనారాయణ నీటి సంఘము వైస్ ప్రెసిడెంట్ ఏలూరు రాంబాబు గ్రామ పంచాయితీ వార్డ్ మెంబర్ నొక్కు పవన్ నీటి సంఘము సభ్యులు వేమగిరి రాజు మరియు దేగల రాంబాబు విద్యాకమిటి చైర్మన్ యాడగాల నారాయుడు టీడీపీ కార్యకర్తలు తూము వీర నాగేశ్వరరావు,వేమగిరి సత్యానందం వెన్న శ్రీను చెరుకు శ్రీను మాజీ వార్డ్ మెంబర్ బొట్టా సురేష్ చెక్క బుల్లిరాజు వేమగిరి బుజ్జిబాబు మాజీ వార్డ్ మెంబర్ గంట వెంకటేష్ అత్తి బాబురావు గ్రామ టీడీపీ తెలుగు యువత సభ్యులు, జనసేన యూత్ సభ్యులు తదిదరులు ఈ కార్యక్రమంలో పాల్గున్నారు.

## ధర్మవరం గ్రామంలో మురళిరాజు పర్యటన

**గొర్ల వారి ఓణీ ఫంక్షన్ లో పాల్గొన్న మురళిరాజు**



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం లో గొర్ల సత్తిరాజు కుమారుడు బాబ్జి కుమార్తె ఓణీ ఫంక్షన్ లో పాల్గొన్న లిఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ %ఏ% ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో మచ్చర్ల దాసు ,ఎంపీటీసీ నానిపల్లి చంటి ,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ,తూపాటి బాబ్జి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రజతోత్స సభ ప్రాంగణాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**మునుగోడు :** బీఆర్ఎస్ పార్టీ 27వ రజతోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో జరుగనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వరంగల్ ఎల్కతుర్తిలో ఆదివారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో కలిసి పరిశీలించారు.

# కాళ్ల పగుళ్లను పోగొట్టే చిట్కాలు..



ఎండాకాలంలో కాళ్ల పగుళ్లు సాధారణ సమస్యగా మారుతుంది. వేడి వాతావరణం, తేమ తక్కువగా ఉండటం, మరియు సరైన సంరక్షణ లేకపోవడం వల్ల చర్మం పొడిబారి, మడమలు పగిలిపోతాయి. ఇవి కేవలం అందం సమస్యే కాక, కొన్నిసార్లు నొప్పి మరియు ఇన్ఫెక్షన్‌కు కూడా దారితీయవచ్చు. మొదట, కాళ్లను తేమగా ఉంచడం చాలా ముఖ్యం. ఎండాకాలంలో చర్మం త్వరగా తేమను కోల్పోతుంది, కాబట్టి రోజూ రాత్రి పడుకునే ముందు కాళ్లను గోరువెచ్చని నీటిలో 10-15 నిమిషాలు నానబెట్టండి. నీటిలో ఒక చెంచా ఉప్పు లేదా కొద్దిగా షాంపూ కలపడం వల్ల చనిపోయిన చర్మం సులభంగా తొలగుతుంది. ఆ తర్వాత, ప్యూమిస్ స్టోన్ లేదా ఫుట్ స్క్రబ్బర్‌తో మడమలను సున్నితంగా రుద్దండి. ఇది పగుళ్లను తగ్గించి, చర్మాన్ని మృదువుగా చేస్తుంది. చర్మం ఎక్కువగా రుద్దడం మానండి, ఇది సమస్యను మరింత తీవ్రతరం చేయవచ్చు. రెండవది, తేమను లాక్ చేయడానికి మాయిశ్చరైజర్ ఉపయోగించండి. కాళ్లను నానబెట్టి, శుభ్రం చేసిన తర్వాత, వెన్న, కొబ్బరి నూనె, లేదా పెట్రోలియం జెల్లీ వంటి గాఢమైన మాయిశ్చరైజర్‌ను రాయండి. ఒక టీస్పూన్ తేనెను కొబ్బరి నూనెతో కలిపి రాస్తే, చర్మం హైడ్రేట్ అవడమే కాక, యాంటీ బాక్టీరియల్ గుణాల వల్ల ఇన్ఫెక్షన్ నివారించబడుతుంది. రాసిన తర్వాత కాటన్ సాక్స్ ధరించడం వల్ల తేమ ఎక్కువ సేపు ఉంటుంది. ఈ పద్ధతిని రోజూ రాత్రి అనుసరిస్తే కొద్ది రోజుల్లోనే మడమలు మృదువుగా మారతాయి. మూడవ చిట్కా, ఇంట్లో తయారుచేసిన స్క్రబ్‌లు మరియు మాస్క్‌లను ఉపయోగించడం. ఒక టేబుల్ స్పూన్ బియ్యం పిండి, ఒక టీస్పూన్ తేనె, మరియు కొద్దిగా ఆలివ్ ఆయిల్ కలిపి స్క్రబ్ తయారు చేయండి. ఈ మిశ్రమాన్ని మడమలపై 5-10 నిమిషాలు మసాజ్ చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయండి. ఇది చనిపోయిన చర్మాన్ని తొలగించి, మడమలను మృదువుగా చేస్తుంది. అలాగే, పండిన అరటిపండును మెత్తగా చేసి, మడమలపై మాస్క్‌లా రాసి 15 నిమిషాల తర్వాత కడిగితే, చర్మం హైడ్రేషన్ మెరుగుపడుతుంది. ఈ సహజ పద్ధతులు వారానికి 2-3 సార్లు చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయి. నీరు తాగడం కూడా కాళ్ల పగుళ్లను నివారించడంలో కీలకం. ఎండాకాలంలో శరీరం తేమను త్వరగా కోల్పోతుంది, కాబట్టి రోజుకు కనీసం 8-10 గ్లాసుల నీరు తాగండి. ఇది చర్మాన్ని లోపలి నుండి తేమగా ఉంచుతుంది. అలాగే, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్ ఇ ఉన్న ఆహారాలు (బాదం, అవకాడో, చేపలు) తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తాగడం కూడా శరీర హైడ్రేషన్‌ను పెంచుతుంది. చివరగా, సరైన ఫుట్‌వేర్ ఎంచుకోవడం మరియు అనవసర ఒత్తిడిని నివారించడం ముఖ్యం. ఎండాకాలంలో ఓపెన్ హీల్ చెప్పులు లేదా బేర్‌ఫుట్ నడవడం వల్ల మడమలు ఎక్కువగా పొడిబారతాయి. కాళ్లను పూర్తిగా కప్పే, సౌకర్యవంతమైన చెప్పులు ధరించండి. అలాగే, ఎక్కువ సేపు నిలబడి పనిచేసే వారు మడమలపై ఒత్తిడిని తగ్గించే ఫుట్ ప్యాడ్‌లు ఉపయోగించవచ్చు. పగుళ్లు తీవ్రంగా ఉంటే లేదా రక్తస్రావం, ఇన్ఫెక్షన్ సంకేతాలు కనిపిస్తే, వెంటనే చర్మవ్యాధి నిపుణుడిని

# ఏసీలో ఈ సీక్రెట్ సెట్టింగ్ తెలిస్తే ఆ పెద్ద ప్రమాదం మీకు తప్పినట్టే



సమ్మర్ లో ఏసీ వినియోగంపైనే పూర్తిగా ఆధారపడిపోతుంటారు. అయితే, ఈ పరికరాన్ని ఉపయోగించేవారు కొన్ని జాగ్రత్తలు పాటించకుంటే అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అంతేకాదు కరెంటు బిల్లును ఆదా చేయడం మరో కష్టమైన పని. ఏసీలో ఈ సీక్రెట్ సెట్టింగ్ గురించి తెలుసుకుంటే ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేయొచ్చు. ఓవర్ హీట్ కు గురికాకుండా మీ ఏసీని ఎక్కువ కాలం మన్నికగా ఉంచుకోవచ్చు. వేసవి కాలంలో ఎయిర్ కండిషనర్ మన జీవితంలో అనివార్యమైన భాగంగా మారింది. అయితే, ఏసీని సరిగ్గా ఉపయోగించకపోతే విద్యుత్ బిల్లు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈకో మోడ్ వంటి ఆధునిక ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యుత్ ఆదా చేయడమే కాక, వేసవిలో భద్రతను కూడా నిర్ధారించుకోవచ్చు. ఏసీ రిమోట్‌లోని ముఖ్యమైన మోడ్‌లలో ఈకో మోడ్ అత్యంత ప్రయోజనకరమైనది. ఈకో మోడ్ ఏసీని తక్కువ విద్యుత్ వినియోగంతో నడిపేలా చేస్తుంది, దీనిలో కూలింగ్ సైకిల్‌ను స్వయంచాలకంగా సర్దుబాటు చేయడం జరుగుతుంది. ఫలితంగా, విద్యుత్ వినియోగం 20-30% వరకు తగ్గుతుంది, ఇది విద్యుత్ బిల్లును తగ్గించడమే కాక, పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. ఈ మోడ్‌ను రాత్రి సమయంలో లేదా వాతావరణం తక్కువ వేడిగా ఉన్నప్పుడు ఉపయోగించడం ఉత్తమం. కూల్ మోడ్ మరో ముఖ్యమైన ఫీచర్, ఇది గదిని త్వరగా చల్లబరచడానికి ఉపయోగపడుతుంది. ఈ మోడ్‌లో, మీరు సెట్ చేసిన ఉష్ణోగ్రతను నిర్వహించడానికి ఏసీ నిరంతరం పనిచేస్తుంది. ఇది రోజు సమయంలో, ముఖ్యంగా వేడి ఎక్కువగా ఉన్నప్పుడు అనువైనది. అయితే, ఈ మోడ్ ఎక్కువ విద్యుత్ వినియోగించవచ్చు కాబట్టి, దీన్ని జాగ్రత్తగా ఉపయోగించాలి. డ్రై మోడ్ గదిలోని తేమను తొలగించడానికి రూపొందించబడింది, ఇది వర్షాకాలంలో లేదా అధిక ఆర్ద్రత ఉన్న వాతావరణంలో ఎంతో ఉపయోగకరం. ఈ మోడ్ కూలింగ్ కంటే తేమ నియంత్రణపై దృష్టి పెడుతుంది, దీనివల్ల గది సౌకర్యవంతంగా ఉంటుంది. అదేవిధంగా, ఫ్యాన్ మోడ్‌లో కంప్రెసర్ ఆగిపోయి, కేవలం ఫ్యాన్ మాత్రమే పనిచేస్తుంది. ఇది విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తుంది కూలింగ్ అవసరం లేని సమయంలో గాలి ప్రసరణ కోసం ఉపయోగించవచ్చు. వేసవిలో ఏసీని సురక్షితంగా ఉపయోగించడానికి కొన్ని చిట్కాలు పాటించడం ముఖ్యం. ముందుగా, ఏసీని 24-26 డిగ్రీల సెల్సియస్ వద్ద సెట్ చేయడం ఆరోగ్యానికి మంచిది మరియు విద్యుత్ ఆదా చేస్తుంది. చాలా తక్కువ ఉష్ణోగ్రతలు ఆరోగ్య సమస్యలను కలిగించవచ్చు. అలాగే, ఏసీ ఫిల్టర్లను ప్రతి 2-3 నెలలకు శుభ్రం చేయడం సంవత్సరానికి ఒకసారి సర్వీసింగ్ చేయించడం వల్ల ఏసీ సామర్థ్యం పెరుగుతుంది గాలి నాణ్యత మెరుగుపడుతుంది. ఏసీని గంటల తరబడి నిరంతరం ఉపయోగించడం వల్ల దాని జీవితకాలం తగ్గుతుంది. రాత్రి సమయంలో ఈకో మోడ్ లేదా టైమర్ ఫంక్షన్‌ను ఉపయోగించడం ద్వారా ఓవర్‌లోడ్‌ను నివారించవచ్చు. అదనంగా, ఏసీ ఆన్‌లో ఉన్నప్పుడు తలుపులు కిటికీలను మూసివేయడం వల్ల కూలింగ్ సామర్థ్యం పెరుగుతుంది విద్యుత్ వృథా తగ్గుతుంది. ఏసీ గదిలో ఎక్కువ సమయం గడిపిన తర్వాత బయటకు వెళ్లేటప్పుడు ఒక్కసారిగా ఉష్ణోగ్రత మార్పు వల్ల ఆరోగ్య సమస్యలు రాకుండా క్రమంగా బయటి వాతావరణానికి అలవాటు చేసుకోవాలి. ఈకో మోడ్ వాడకం విద్యుత్ బిల్లును 30% వరకు తగ్గించడమే కాక, దీర్ఘకాలంలో ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుంది. అంతేకాక, తక్కువ విద్యుత్ వినియోగం కార్బన్ ఉద్గారాలను తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుతుంది. ఈ చిట్కాలను అనుసరించడం ద్వారా వేసవిలో చల్లగా, సురక్షితంగా  ఆర్థికంగా ఉండవచ్చు.

# వేడి వేడి పాలలో కుంకుమ పువ్వు కలుపుకుని తాగుతున్నారా..?



రాత్రి వేళ పాలు జీర్ణమవడం కష్టం. అందుకే ఉదయం వేళ తాగితే మంచిది. మీ శరీర స్వభావాన్ని బట్టి ఎప్పుడు తాగాలా నిర్ణయించుకోవచ్చు. చల్లని పాలలో కుంకుమ పువ్వు కలిపి తాగితే చర్మంపై నిగారింపు వస్తుంది. మెదడుకు కూడా మంచిది. తరచూ ఇలా కుంకుమ పువ్వు పాలు తీసుకోవటం వల్ల శరీరానికి చలువచేస్తుంది. ఆయుర్వేదం ప్రకారం వేడి పాలలో కుంకుమ పూలు కలిపి తాగితే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది.  వివిధ రకాల సుగంధ ద్రవ్యాల్లో కుంకుమ పువ్వు చాలా ఖరీదైంది. ఇది రుచిలోనే కాకుండా ఆరోగ్యపరంగా అద్భుతమైన ప్రయోజనాలు కలిగి ఉంటుంది. కుంకుమ పూవు వాసన కొద్దిగా తీయగా, ఘాటుగా ఉంటుంది. కొద్దిగా చేదు కూడా ఉంటుంది. ఇందులో కేలరీలతో పాటు ఫైబర్, ప్రోటీన్లు, విటమిన్ సి, మాంగనీస్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కుంకుమ పువ్వును పాలలో కలిపి తాగితే చాలా మంచిదని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు, పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే, కుంకుమ పువ్వు కలిపేందుకు వేడి పాలు తీసుకోవాలా..? లేదంటే చల్లటి పాలలో కుంకుమ పువ్వు కలిపి తాగితే ఏమౌతుందో తెలుసుకోవటం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. కుంకుమ పువ్వు పాలతో పోషక విలువలు పెరుగుతాయని పోషకాహార నిపుణులు అంటున్నారు. శరీరానికి అంతర్గతంగా బలం చేకూరుతుందని చెబుతారు. కుంకుమ పువ్వు చర్మ సంరక్షణకు చాలా మంచిది. పాలలో కలుపుకుని తాగుతుంటారు. జలుబు దగ్గు సమస్య ఉంటే వేసవిలో కూడా కుంకుమ పాలు తాగవచ్చు. అయితే కుంకుమ పువ్వును ఎప్పుడూ చల్లనిపాలలోనే కలిపి తాగాలి. వేడి పాలలో కలిపి తాగితే ఎసిడిటీ సమస్య రావచ్చు. రాత్రి వేళ పాలు జీర్ణమవడం కష్టం. అందుకే ఉదయం వేళ తాగితే మంచిది. మీ శరీర స్వభావాన్ని బట్టి ఎప్పుడు తాగాలా నిర్ణయించుకోవచ్చు. చల్లని పాలలో కుంకుమ పువ్వు కలిపి తాగితే చర్మంపై నిగారింపు వస్తుంది. మెదడుకు కూడా మంచిది. తరచూ ఇలా కుంకుమ పువ్వు పాలు తీసుకోవటం వల్ల శరీరానికి చలువచేస్తుంది. ఆయుర్వేదం ప్రకారం వేడి పాలలో కుంకుమ పూలు కలిపి తాగితే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంటే వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి కాస్త గోరువెచ్చగా, లేదంటే చల్లటి పాలలో కుంకుమ పువ్వు కలిపి తీసుకోవాలని చెబుతున్నారు.

# ముఖం మీద ముడతలతో ఇబ్బందిగా ఉందా?



మనమందరం అరటిపండు తినగానే తొక్కను విసిరెయ్యడం సాధారణంగా చేస్తుంటాము. కానీ ఆ అరటి తొక్కను తేలికగా తీసిపారేయకండి. ఎందుకంటే అది మన చర్మం కోసం ఓ సహజ ఔషధంలా పనిచేస్తుంది. పలు పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు కలిగిన ఈ తొక్కలు చర్మ సమస్యలపై సమర్థంగా పనిచేస్తాయి. పొడి చర్మానికి తేమ అందించటం, మొటిమలను తగ్గించటం, ముడతలు తొలగించటం వంటి ఎన్నో లాభాలున్నాయి.
అరటి తొక్కలో ఉన్న పొటాషియం చర్మానికి తేమను అందించే శక్తివంతమైన సహజ పదార్థం. ఇది చర్మాన్ని మృదువుగా, మెత్తగా ఉంచుతుంది. పొడి, రాపిడి గల చర్మానికి అరటి తొక్క ఉపయోగించటం వల్ల తేమ సమతుల్యం అవుతుంది. ఈ తొక్కను ముఖంపై నెమ్మదిగా రుద్ది 10 నిమిషాల తర్వాత కడిగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి.అరటి తొక్కల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి మొటిమలకు కారణమయ్యే క్రిములను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖంపై మొటిమలు కనిపించినపుడు అరటి తొక్కను వాటిపై మెల్లగా రుద్దటం వలన వాపు, ఎరుపు తగ్గిపోతుంది. నిత్యం వాడితే మొటిమల రాక తగ్గుతుంది.
వయస్సు పెరుగుతున్న కొద్దీ చర్మం మీద ముడతలు పడటం సహజం. అయితే అరటి తొక్కల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఈ ముడతల్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని ఇది తిప్పికొడుతుంది. చర్మం కుదింపును మెరుగుపరచి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది.అరటి తొక్కలను క్రమం తప్పకుండా ఉపయోగించటం వలన చర్మం సహజంగా నిగారింపుగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. ముఖం మీద ఉన్న మచ్చలు, ముదురు రంగును తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. తక్కువ సమయంలోనే ప్రకాశవంతమైన చర్మాన్ని పొందొచ్చు.అరటి తొక్కను ముఖంపై మృదువుగా రుద్దటం వల్ల చనిపోయిన చర్మ కణాలు తొలగిపోతాయి. ఇది సహజంగా ఎక్స్ఫోలియేట్ చేసే పదార్థంగా పనిచేస్తుంది. వారం పాటు రెండుసార్లు ఉపయోగించటం వల్ల చర్మం తాజాగా మెరిసిపోతుంది. అయితే దినసరి వాడకం వల్ల చర్మం చికాకు పడే అవకాశం ఉంటుంది కాబట్టి మితంగా ఉపయోగించాలి. కళ్ల కింద కనిపించే నల్లటి వలయాలు, వాపును అరటి తొక్కల సహాయంతో తగ్గించవచ్చు. తొక్కను చిన్న ముక్కలుగా కట్ చేసి కళ్ల కింద 10 నిమిషాలు ఉంచాలి. ఇది చల్లదనాన్ని కలిగించి కళ్ల చుట్టూ ఉన్న భాగాన్ని శాంతపరుస్తుంది. రెగ్యులర్‌గా వాడితే మంచి మార్పు కనిపిస్తుంది. ఈ తొక్కలను తగిన జాగ్రత్తలతో నియమితంగా ఉపయోగించండి. ఫలితంగా మీ చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది.

# శనగలను ఇలా తింటే నమ్మలేని లాభాలు..



నల్ల శనగలు తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నల్ల శనగపప్పు ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేసే ఇనుము, ఇతర పోషకాలకు నిధి వంటివి. చాలా మంది వీటిని కూరగా తింటారు. ఉడకబెట్టి తింటారు. కానీ వీటిని నానబెట్టిన తినడం వల్ల ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని మీకు తెలుసా..? నానబెట్టిన నల్ల శనగలను ఉదయం పరగడుపున తినడం వల్ల లెక్కలేనన్ని ప్రయోజనాలు ఉన్నాయి.మన శరీర ఆరోగ్యానికి దోహదం చేసే ఆహారాలలో నల్ల శనగలు ఒకటి . నానబెట్టిన నల్లశనగలు ఒక వంద గ్రాములు కనుక మీరు తిన్నట్లయితే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడి కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు. అంతేకాదు మీ శరీరానికి కావలసిన అన్ని రకాల ప్రోటీన్లు ఈ నల్ల శనగలలో పుష్కలంగా ఉండటం వలన అలసట రాదు. నానబెట్టిన శనగలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు అత్యంత గొప్ప మూలం. అలాంటి నల్ల శనగలను నానబెట్టడం వల్ల అందులోని ప్రోటీన్లు, విటమిన్లు, ఇతర పోషకాల నాణ్యత మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పైగా అవి సులభంగా జీర్ణమవుతాయి. ప్రతిరోజూ ఒక గుప్పెడు నానబెట్టిన నల్ల శనగలు తినడం వల్ల బోలెడు లాభాలు ఉన్నాయి. అధిక బరువు, శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌తో ఇబ్బంది పడుతున్న వారికి నల్ల శనగలు చాలా మంచిది. త్వరగా సన్న బడటానికి, అధిక బరువుతో పాటు కొలెస్ట్రాల్ తగ్గడానికి నానబెట్టిన నల్ల శనగలు ఎంతగానో దోహదపడతాయి. శనగలు కాల్షియం, ఫాస్ఫరస్ వంటి మంచి పోషకాలతో నిండి ఉంటాయి. ఇవన్నీ ఎముకలకు బలాన్నిస్తాయి. నల్ల శనగలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ బీ 6, మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉండి మెదడు, గుండె ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర అధికంగా ఉన్నవారికి షుగర్ నియంత్రణకు నల్ల శనగలు అద్భుతంగా పనిచేసే మంచి ఆహారం. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఉన్నవారికి నల్ల శనగలు తినటం వల్ల ఉపశమనం కలుగుతుంది.. ముఖ్యంగా మల బద్ధకంతో బాధపడేవారికి మంచి ఫలితాలు ఉంటాయి. శనగలు శరీరానికి తగినంత శక్తిని ఇవ్వటానికి సహాయపడతాయి. మలబద్ధక నివారణకు మంచిది. ఉపయోగం ఉంటుంది. నల్ల శనగలలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. రోజు ఒక అరకప్పు నానబెట్టిన నల్ల శనగలు ఒక వారం రోజుల పాటు క్రమం తప్పకుండా తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శనగలు చర్మ ఆరోగ్యానికే కాదు, జుట్టు ఆరోగ్యానికి కూడా దోహదం చేస్తుంది. నల్ల శనగలతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. నరాల బలహీనత ఉన్న వారికి నల్ల శనగలు దివ్య ఔషధంగా చెబుతున్నారు. ఎన్నో మానసిక సమస్యలకు సైతం నల్ల శనగలు పరిష్కారం అంటున్నారు నిపుణులు. తరచూ నానబెట్టిన నల్ల శనగలు తింటూ ఉంటే.. కొద్ది రోజుల్లోనే మీ శరీరంలో ఊహించని మార్పులను గమనిస్తారని నిపుణులు చెబుతున్నారు.

బిజినెస్

## విడాకులు తీసుకుంటే క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది!.. ఎలా అంటే?



ఈ మధ్యకాలంలో విడాకులు తీసుకునేవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. కారణం ఏదైనా విడాకులు వరకు వెళ్లిపోతున్నారు. డివోర్స్ తీసుకుంటే ఆ తరువాత జరిగే పరిణామాలు ఎలా ఉన్నా.. క్రెడిట్ స్కోర్ తగ్గిపోయే అవకాశం ఉంది. ఇది వినడానికి వింతగా అనిపించినప్పటికీ, ఈ కథనం చదివితే.. తప్పకుండా మీకే అర్థమవుతుంది. భార్యాభర్తలు కలిసి ఉన్నప్పుడు (ఉద్యోగం చేసే వారైతే).. జాయింట్ అకౌంట్స్ మీద హోమ్ లోన్, వెహికల్ లోన్ వంటివి తీసుకుని ఉంటే.. విడాకులు తరువాత ఈ ఖాతాలను క్లోజ్ చేస్తే సిబిల్ స్కోర్ తగ్గిపోతుంది. ఎలా అంటే.. జాయింట్ అకౌంట్స్ కింద తీసుకున్న లోన్‌కు ఇద్దరూ బాధ్యత వహించాలి. ఆలా కాకుండా అకౌంట్ క్లోజ్ చేస్తే లేదా లోన్ చెల్లింపులు ఆలస్యం చేస్తే సిబిల్ స్కోర్ తగ్గిపోతుంది. కలిసి ఉన్నప్పుడు ఇద్దరి సంపాదన తోడవుతుంటుంది. విడాకుల తరువాత ఎవరి దారి వారిదే. అలాంటి సమయంలో ఆర్థిక ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుంది. ఇది మీ ఈఎంఐల మీద ప్రభావం చూపిస్తుంది. ఇది కూడా సిబిల్ స్కోర్ తగ్గిపోవడానికి కారణమవుతుంది. విడాకులు మంజూరు చేసే సమయంలో లోన్స్ క్లియర్ చేయాల్సిన బాధ్యతను మీ భాగస్వామికి కోర్టు అప్పగించినప్పటికీ.. లోన్ అగ్రిమెంట్స్ మీద ఇద్దరి సంతకాలు ఉంటాయి. అలాంటి సమయంలో మీ భాగస్వామి చెల్లింపులను ఆలస్యం చేస్తే.. ఆ ప్రభావం ఇద్దరిపైన పడుతుంది. ఇది సిబిల్ స్కోర్ తగ్గడానికి కారణమవుతుంది. జాయింట్ అకౌంట్స్ లేదా క్రెడిట్ కార్డులను విడాకులు తీసుకున్న వెంటనే క్లోజ్ చేసుకున్నట్లయితే.. అది మీ క్రెడిట్ స్కోర్ మీద ప్రభావం చూపిస్తుంది. కాబట్టి విడాకులు తీసుకున్న తరువాత కూడా ఇలాంటి ఆర్థిక సంబంధ లావాదేవీల గురించి మాట్లాడుకుంటే.. సిబిల్ స్కోర్ తగ్గకుండా చూసుకోవచ్చు.

## ట్రంప్ కొట్టిన దెబ్బ.. ఊడుతున్న 800 ఉద్యోగాలు!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. అన్ని పరిశ్రమల్లోనూ అనిశ్చితి ఆవహించింది. ఈ క్రమంలో స్వీడన్‌కు చెందిన భారీ వాహన తయారీ సంస్థ వోల్వో గ్రూప్ కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్ అనిశ్చితి, ట్రక్కులకు డిమాండ్ తగ్గుముఖం పట్టడం వంటి కారణాలతో అమెరికాలోని మూడు కర్మాగారాలలో 550 నుంచి 800 మంది కార్మికులను తొలగించేందుకు సిద్ధమైందని రాయిటర్స్ కథనం పేర్కొంది. ఈ తొలగింపులు పెన్సిల్వేనియాలోని మకుంగీలో ఉన్న మాక్ ట్రక్స్ ప్లాంట్, వర్జీనియాలోని డబ్లిన్, మేరీల్యాండ్‌లోని హేగర్‌స్టౌన్‌లో ఉన్న రెండు వోల్వో సైట్‌లలోని ఉద్యోగులను ప్రభావితం చేస్తాయి. ట్రంప్ విధించిన సుంకాలు ప్రపంచ వాణిజ్యాన్ని, ముఖ్యంగా ఆటోమోటివ్, భారీ పరికరాల రంగాలను అస్తవ్యస్తం చేసి, తయారీ ఖర్చులను పెంచడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## చేతులు మారుతున్న కంపెనీలు..

# రూ.వందల కోట్ల డీల్స్

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ తాజాగా శ్రేష్ఠ నేచురల్ బయోప్రొడక్ట్స్‌లో 100 శాతం వాటా సొంతం చేసుకోనుంది. 24మంత్ర ఆర్గానిక్ బ్రాండు కంపెనీతో వాటా కొనుగోలు ఒప్పందాన్ని(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఐటీసీ వెల్లడించింది. ఇందుకు నగదు రూపేణా దాదాపు రూ. 473 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. 24మంత్ర బ్రాండుతో 100 రకాలకుపైగా ఫుడ్ ప్రొడక్టులను శ్రేష్ఠ విక్రయిస్తోంది. తద్వారా వేగవంత వృద్ధిలోనున్న ఆర్గానిక్ ఫుడ్ ప్రొడక్టుల విభాగంలో ఐటీసీ మరింత విస్తరించనుంది. కాగా.. మరోపక్క సహచర సంస్థ మదర్ స్పార్ష్ బేబీ కేర్‌లో మిగిలిన 73.5 శాతం వాటా సైతం చేజిక్కించుకోనున్నట్లు పేర్కొంది. 2022లో ఈ డీ2సీ కంపెనీలో 26.5 శాతం వాటా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

**కేఫిన్‌టెక్ చేతికి ఎసెంట్ ఫండ్ సర్వీసెస్**

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్వెస్టర్ సొల్యూషన్స్ సేవల సంస్థ కేఫిన్ టెక్నాలజీస్ తాజాగా ఎసెంట్ ఫండ్ సర్వీసెస్‌లో 51 శాతం వాటాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ 34.7 మిలియన్ డాలర్లు. వచ్చే అయిదేళ్లలో ఎసెంట్‌లో కేఫిన్‌టెక్ 100 శాతానికి వాటాలు పెంచుకోనుంది. ఇందుకోసం మిగతా 49 శాతం వాటాలను 2028, 2029, 2030లో ఏడాదికి 16.33 శాతం చొప్పున దక్కించుకోనుంది. సింగపూర్ హెడ్‌క్వార్టర్స్‌గా కార్యకలాపాలు



సాగిస్తున్న ఎసెంట్ అంతర్జాతీయంగా 260 పైచిలుకు గ్లోబల్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజర్లకు ఫండ్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసులు అందిస్తోంది. అత్యంత వేగంగా ఎదుగుతున్న అంతర్జాతీయ ఫండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కేఫిన్‌టెక్ విస్తరించేందుకు ఈ డీల్ ఉపయోగపడుతుందని సంస్థ ఎండీ శ్రీకాంత్ నాదెళ్ల తెలిపారు. ఇరు సంస్థలు సమిష్టిగా మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకుని, పరిశ్రమలో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతాయని ఎసెంట్ సహ%-%వ్యవస్థాపకుడు కౌశల్ మండలియా తెలిపారు.

## దూసుకెళ్తున్న బంగారం ధరలు.. 4 నెలల్లోనే బంపర్ జంప్

బంగారం ధరలు ఈ ఏడాదిలో ఇప్పటివరకు అద్భుతమైన ప్రదర్శనను కనబర్చాయి. ఈ క్రమంలో ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో బంగారం 25 శాతం పెరుగగా, మార్కెట్లలో సరికొత్త గరిష్ట స్థాయిలను చేరుకుంది. అదే సమయంలో వెండి కూడా 15 శాతం లాభాన్ని సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన ప్రమాదాలు, అమెరికా, చైనా మధ్య వ్యాపార ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షితమైన గోల్డ్ పెట్టుబడులపై ఆసక్తి చూపించారు. దీంతో పసిడి రేట్లు పైపైకి చేరాయి.

**బంగారానికి సానుకూల దృష్టి**

టెక్నికల్ స్థాయిల ప్రకారం, బంగారం ధర రూ. 91,000 (10 గ్రాముల కోసం) ఉండగా, రూ. 99,000 వద్ద ప్రతిఘటన స్థాయిలు ఉన్నాయని మోతీలాల్ ఓస్వాల్ పేర్కొంది. ముఖ్యమైన స్థాయిలు 3,100, 3,400 ఉండగా, ఈ స్థాయిలు సాధారణ స్థితిలో ఉండే అవకాశమున్నట్లు తెలిపారు. బంగారం పెరుగుదలకు ప్రధాన కారణం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వ్యాపార ఉద్రిక్తతలు, మదుపరుల అవసరాలు, కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు కూడా ఓ



కారణమని నిపుణులు చెబుతున్నారు.

రక్షణ కోసం బంగారం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు, మాంద్యం భయాందోళన కొనసాగుతున్న నేపథ్యంలో అనేక మంది ఇన్వెస్టర్లు బంగారాన్ని మంచి పెట్టుబడిగా భావిస్తున్నారు. విభిన్న వ్యాపార సవాళ్లు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అనిశ్చితమైన రాజకీయ పరిస్థితుల మధ్య, బంగారం ధరలు పైపైకి చేరుతున్నాయి.

ఇదే సమయంలో కేంద్ర బ్యాంకులు తమ రిజర్వులను పెంచుతుండగా, పెట్టుబడిదారులు సురక్షిత వనరుల కోసం బంగారాన్ని ఎంచుకుంటున్నారు.

**పెట్టుబడుల వైపు దృష్టి**

ఈ సంవత్సరంలో బంగారం ధరలతోపాటు వెండి రేట్లు కూడా వేగంగా పెరుగుతున్నాయి. గత కొన్ని నెలల్లో బంగారం కంటే వెండి ధరలు ఎక్కువగా పెరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై అధిక టారిఫ్‌ల గురించి చేసిన ఇటీవల వ్యాఖ్యలు, బంగారాన్ని తగ్గేలా చేశాయి. కానీ ఆ తర్వాత త్వరగా తిరిగి పుంజుకున్నాయి. అమెరికా, చైనా వ్యాపార విధానాలు, అదుపులో ఉంచిన వృద్ధి పరిస్థితులు సహా అనేక అంశాలు అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభం అనుమానాలను మరింతగా పెంచాయి. ఇలాంటి పరిస్థితుల వేళ అమెరికా డాలర్ ఏడు శాతం తగ్గింది. ఆర్థిక విధానాలు కూడా మార్కెట్ విధానాలను ప్రభావితం చేశాయి.

స్పోర్ట్స్

## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి..

# మరో భారీ రికార్డు సొంతం

పరుగుల యంత్రం విరాట్ కోహ్లి మరో భారీ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 20) పంజాబ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన కోహ్లి.. ఐపీఎల్‌లో అత్యధిక 50 ప్లస్ స్కోర్లు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో విరాట్ ఇప్పటివరకు 67 ఫిఫ్టి ప్లస్ స్కోర్లు చేశాడు. ఇందులో 59 హాఫ్ సెంచరీలు, 8 సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్‌లో రెండో అత్యధిక ఫిఫ్టి ప్లస్ స్కోర్లు చేసిన రికార్డు డేవిడ్ వార్నర్ పేరిట ఉంది. వార్నర్ 66 ఫిఫ్టి ప్లస్ స్కోర్లు చేశాడు. ఇందులో 62 హాఫ్ సెంచరీలు, 4 సెంచరీలు ఉన్నాయి.

ఐపీఎల్‌లో అత్యధిక ఫిఫ్టి ప్లస్ స్కోర్లు చేసిన టాప్-5 బ్యాటర్స్..

విరాట్- 67 (59 హాఫ్ సెంచరీలు, 8 సెంచరీలు)
వార్నర్- 66 (62, 4)
శిఖర్ ధవన్- 53 (51, 2)
రోహిత్ శర్మ- 45 (43, 2)
కేఎల్ రాహుల్- 43 (39, 4)
ఏబీ డివిలియర్స్- 43 (40, 3)

మ్యాచ్ విషయానికొస్తే.. ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో




పంజాబ్‌పై ఆర్సీబీ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేయగా.. ఆర్సీబీ 18.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ అజేయ అర్ధ శతకంతో (73) ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. జితేశ్ శర్మ (11) సిక్సర్ బాది మ్యాచ్‌ను లాంఛనంగా ముగించాడు. ఆర్సీబీ ఇన్నింగ్స్‌లో దేవ్‌దత్ పడిక్కల్ (61) మెరుపు అర్ధ సెంచరీ చేయగా.. సాల్ట్ (1), రజత్ పాటిదార్ (12) తక్కువ స్కోర్లకు ఔటయ్యారు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్, హర్‌ప్రీత్ బ్రార్, చహల్ తలో వికెట్ పడగొట్టారు.

పంజాబ్ ఇన్నింగ్స్‌లో ప్రభ్‌సిమ్రన్ సింగ్ (33) టాప్ స్కోరర్‌గా కాగా.. ప్రియాన్ష్ ఆర్య 22, శ్రేయస్ అ?య్యర్ 6, జోస్ ఇంగ్లిస్ 29, నేహల్ వధేరా 5, స్టోయినిస్ 1, శశాంక్ సింగ్ 31 (నాటౌట్), జన్సెన్ 25 (నాటౌట్) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా, సుయాశ్ శర్మ తలో రెండు వికెట్లు తీయగా.. రొమారియో షెపర్డ్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.


**ప్రతీకారం తీర్చుకున్న ఆర్సీబీ**

ఈ మ్యాచ్‌లో గెలుపుతో ఆర్సీబీ గత మ్యాచ్‌లో పంజాబ్ చేతిలో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంది. ఇరు జట్ల మధ్య రెండు రోజుల కిందటే బెంగళూరు వేదికగా మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో పంజాబ్ ఆర్సీబీని చిత్తుగా ఓడించింది. ఈ గెలుపుతో ఆర్సీబీ పంజాబ్‌ను కిందికి దించి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం గుజరాత్, ఢిల్లీ, ఆర్సీబీ, పంజాబ్, లక్నో తలో 10 పాయింట్లతో టాప్-5లో ఉన్నాయి

## యువరాజ్ సింగ్‌ను అధిగమించిన ప్రభ్‌సిమ్రన్ సింగ్

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 20) జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ తలపడుతున్నాయి. పంజాబ్ హోం గ్రౌండ్ ముల్లాన్‌పూర్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. పంజాబ్, ఆర్సీబీ రెండు రోజుల కిందటే బెంగళూరులో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో ఆర్సీబీ చిత్తుగా ఓడింది. ఇవాళ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తుంది. కృనాల్ పాండ్యా (4-0-25-2), సుయాశ్ శర్మ (4-0-26-2), రొమారియో షెపర్డ్ (2-0-18-1) చెలరేగడంతో పంజాబ్ 18 ఓవర్ల తర్వాత 6 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ప్రియాన్ష్ ఆర్య 22, ప్రభ్‌సిమ్రన్ సింగ్ 33, శ్రేయస్ అ?య్యర్ 6, జోస్ ఇంగ్లిస్ 29, నేహల్ వధేరా 5, స్టోయినిస్ 1 పరుగు చేసి ఔట్ కాగా.. శశాంక్ సింగ్ 25, జన్సెన్ 14 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఆ ఫ్రాంచైజీ దిగ్గజ ఆటగాడు యువరాజ్ సింగ్ రికార్డును అధిగమించాడు. యువరాజ్ పంజాబ్ కింగ్స్ తరఫున 959 పరుగులు (51 మ్యాచ్‌ల్లో) చేయగా.. ఈ మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రన్ యువీ పరుగుల సంఖ్యను దాటేశాడు. ప్రభ్‌సిమ్రన్ పంజాబ్ తరఫున 42 మ్యాచ్‌ల్లోనే 965 పరుగులు చేశాడు. సగటు, స్ట్రయిక్‌రేట్‌లోనూ ప్రభ్‌సిమ్రన్ యువరాజ్ కంటే మెరుగ్గా ఉన్నాడు. పంజాబ్ తరఫున యువీ యావరేజ్ 22.30గా ఉండగా.. ప్రభ్‌సిమ్రన్ యావరేజ్ 22.97గా ఉంది. యువీ స్ట్రయిక్‌రేట్ 127.86గా ఉండగా.. ప్రభ్‌సిమ్రన్ స్ట్రయిక్‌రేట్ 150.55గా ఉంది. ఐపీఎల్‌లో పంజాబ్ ఫ్రాంచైజీ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కేఎల్ రాహుల్ (2548) ఉన్నాడు. అతడి తర్వాత షాన్ మార్ష్ (2477), డేవిడ్ మిల్లర్ (1974), మయాంక్ అగర్వాల్ (1513), మ్యాక్స్‌వెల్ (1424), క్రిస్ గేల్ (1339), వృద్ధిమాన్ సాహా (1190), మనన్ వోహ్రా (1106), మన్‌దీప్ సింగ్ (1073), కుమార సంగక్కర (1009), శిఖర్ ధవన్ (985) ఉన్నారు. ప్రభ్‌సిమ్రన్ ప్రస్తుతం పంజాబ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో 12వ స్థానంలో ఉన్నాడు.

## రెచ్చిపోయిన జింబాబ్వే బౌలర్లు.. స్వల్ప స్కోర్‌కే కుప్పకూలిన బంగ్లాదేశ్



ఐపీఎల్ రసవత్తరంగా సాగుతున్న వేల బంగ్లాదేశ్, జింబాబ్వే మధ్య టెస్ట్ మ్యాచ్ మొదలైంది. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం జింబాబ్వే జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుంది. ఇందులో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 20) తొలి టెస్ట్ మ్యాచ్ ప్రారంభమైంది. సిల్హెట్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి రోజు జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోయారు. ముజరబానీ, వెల్లింగ్టన్ మసకడ్జ తలో 3.. న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీయడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై బంగ్లాదేశ్‌కు ఇది నాలుగో అత్యల్ప స్కోర్. బంగ్లా ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్ (56) అర్ధ సెంచరీతో రాణించగా.. కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో (40), జాకిర్ అలీ (28), మహ్మదుల్ హసన్ రాయ్ (14), షద్మాన్ ఇస్లాం (12), హసన్ మహమూద్ (19) రెండంకెల స్కోర్లు చేశారు. స్టార్ ప్లేయర్ ముష్ఫికర్ రహీం 4, మెహిది హసన్ మిరాజ్ 1, తైజుల్ ఇస్లాం 3, నహిద్ రాణా డకౌటయ్యారు. ఖలీద్ అహ్మద్ 4 పరుగులతో అజేయంగా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన జింబాబ్వే తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 67 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ 40, బెన్ కర్రన్ 17 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.

# చాన్నాళ్ల తర్వాత పోస్ట్ పెట్టిన మహేశ్



హీరో మహేశ్ బాబు ప్రస్తుతం రాజమౌళి సినిమాతో బిజీగా ఉన్నాడు. కొన్నిరోజుల క్రితం ఒడిశాలో షూటింగ్ పూర్తి చేసుకుని వచ్చాడు. ఆ వెంటనే తన కుటుంబంతో కలిసి ఇటలీ ట్రిప్ వేశాడు. తాజాగా తిరిగి హైదరాబాద్ వచ్చేశాడు. ఈ క్రమంలోనే తల్లి గురించి ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. మహేశ్ బాబుకు తల్లి ఇందిరా దేవి అంటే ఎంతిష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కానీ 2022లో ఆమె చనిపోవడం మాత్రం మహేశ్ కి తీరనిలోటు అని చెప్పొచ్చు. తర్వాత సందర్భం వచ్చిన ప్రతిసారి ఆమెని గుర్తుచేసుకుంటూ ఉంటాడు. తాజాగా ఆదివారం (ఏప్రిల్ 20) ఆమె పుట్టినరోజు సందర్భంగా మహేశ్ బాబు లవ్లీ పోస్ట్ పెట్టాడు. మాటల్లో చెప్పలేనంతగా నిన్ను మిస్ అవుతున్నా అమ్మ.. హ్యాపీ బర్త్ డే అని అమ్మతో కలిసి ఉన్న ఓ ఫొటోని మహేశ్ బాబు పోస్ట్ చేశాడు. దీనికి అతడి అభిమానులు తెగ కామెంట్స్ పెడుతున్నారు. తల్లినే కాదు కుటుంబానికి మహేశ్ చాలా ప్రాధాన్యమిస్తాడు. అయితే షూటింగ్ లో ఉంటాడు. లేదంటే ఫ్యామిలీతో ఎక్కువ సమయం గడిపుతూ కనిపిస్తుంటాడు. అందుకే ఏడాదిలో రెండు మూడు సార్లు కూతురు సితార కొడుకు గౌతమ్, భార్య నమ్రతతో కలిసి మహేశ్ ట్రిప్స్ కి వెళ్తూనే ఉంటాడు. ఇక రాజమౌళితో మహేశ్ బాబు చేస్తున్న సినిమా విషయానికొస్తే.. ?అడవుల బ్యాక్ డ్రాప్ లో జరిగే అడ్వెంచరస్ కథతో దీన్ని తీస్తున్నారు. మహేశ్ తోపాటు ప్రియాంక చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మే 31న గానీ లేదా అంతకుముందే మూవీ గురించి అనౌన్స్ మెంట్ ఉండొచ్చని తెలుస్తోంది.



# ఉపేంద్ర పోషించిన అలాంటి పాత్ర చేయాలని ఉంది

సంపూర్ణేశ్‌బాబు సంజోశ్ అన్నదమ్ములుగా నటించిన సినిమా 'సోదరా' ఆర్తి, ప్రాచి బన్సాల్ హీరోయిన్లు. మన్మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సంపూర్ణేశ్ బాబు, సంజోశ్ తాజాగా మీడియాతో మాట్లాడారు. సినిమా విశేషాలు పంచుకున్నారు. "అన్నదమ్ముల అనుబంధాన్ని వెండితెరపై ఆవిష్కరించే చిత్రమిది. ఇది నా గత చిత్రాల తరహాలో ఉండదు. అన్నగా బాధ్యత కలిగిన పాత్రలో నటించాను. నా వ్యక్తిగత జీవితానికి ఈ సినిమా ఎంతో దగ్గరగా ఉంటుంది. ఈ పాత్రలో యాక్ట్ చేయడానికి మొదట కాస్త ఇబ్బందిపడ్డా. పాత్రలోనే జీవించాలనే కారణంతో ఈ సినిమా పూర్తయ్యే వరకూ ఇతర ప్రాజెక్టులు చేయలేదు. వినోదంతోపాటు అన్ని రకాల భావోద్వేగాలతో సాగే చిత్రమిది. 'హృదయ కాలేయం'లో ఉన్న కామెడీ మాత్రం ఉండదు. 'హృదయ కాలేయం' లాంటి సినిమాలు ఎందుకు చేయడం లేదని చాలా మంది అడుగుతున్నారు. అయితే ఆ స్థాయికు తగ్గ కథలు దొరకడం లేదు. ఈ మధ్య కథలు విన్నాను. కానీ పెద్దగా నచ్చలేదు. ఈ చిత్రాన్ని మించిన కామెడీ కథ దొరికితే చేస్తా. 'ఏ'లో ఉపేంద్ర పోషించిన లాంటి పాత్ర చేయాలని ఉంది" అని తెలిపారు. ఈ సినిమా ప్రతి ఒక్కరిని అలరిస్తుందని సంజోశ్ తెలిపారు. ఇలాంటి మంచి కథలో భాగం కావడం ఆనందంగా ఉందన్నారు.



# 'సూర్యాపేట్ జంక్షన్'రిలీజ్ డేట్ ఫిక్స్

ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా అభిమన్యు సింగ్ కీలక పాత్రలో నటించిన మూవీ 'సూర్యాపేట్ జంక్షన్'. యోగాలక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై అనీల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్ శ్రీనివాసరావు నిర్మాణంలో, రాజేష్ నాదెండ్ల దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ ఈ నెల 25న థియేటర్ లలో విడుదల కాబోతుంది. ప్రముఖ నటుడు అభిమన్యు సింగ్ కీలక పాత్రలో నటించారు. గ్లోబల్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా తెలుగు రాష్ట్రాలలో గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఈశ్వర్ మాట్లాడుతూ...ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్ కు డిజిటల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్ గా రిలీజైన "మ్యాచింగ్.. మ్యాచింగ్" సాంగ్ తో పాటు టీజర్ ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. మంచి కథ ఉంటే తెలుగు ప్రేక్షకులు అదరిస్తారు, హిట్టు చేస్తారని ఎన్నో సార్లు రుజువైంది. అందుకే ఈ సినిమా చేశాం. సినిమాలో యాక్షన్ సీన్స్ కూడా చాలా సహజంగానే ఉంటాయి. ఈ నెల 25న రిలీజ్ అయ్యే ఈ సినిమాను థియేటర్ లలో చూసి మీరందరూ మమ్మల్ని అదరిస్తారని ఆశిస్తున్నాను." అని అన్నారు. ప్రొడ్యూసర్ అనిల్ కుమార్ కాట్రగడ్డ మాట్లాడుతూ... "మా సూర్యాపేట్ జంక్షన్ మూవీ ఈ నెల 25న ఆంధ్రా, తెలంగాణాలలో గ్లోబల్ సినిమా డిస్ట్రిబ్యూషన్ లో విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా సునీల్ గారికి, రాంమోహన్ గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం. మా సూర్యాపేట్ జంక్షన్ సినిమాని థియేటర్ లలో ప్రతి ఒక్కరూ చూడాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని అన్నారు.



# నేను కమెడియన్ కాదు.. ఆ సినిమా చేసి తప్పు సిగరెట్లు అందుకే మానేశా!

ప్రియదర్శి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన తొమ్మిదేళ్లలోనే తనకంటూ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడు. మొదట్లో హీరో స్నేహితుడిగా చిన్నచిన్న పాత్రలు చేసుకుంటూ పోయిన అతడు ప్రస్తుతం కథానాయకుడిగా సినిమాలు చేస్తున్నాడు. కోర్ట్‌తో సంచలన విజయాన్ని సాధించిన ప్రియదర్శి సారంగపాణి జాతకంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీ ఏప్రిల్ 25న విడుదల కానుంది.

**ఎంజాయ్ చేస్తున్నానంతే..**

ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ప్రియదర్శి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ప్రియదర్శి మాట్లాడుతూ.. నా తొమ్మిదేళ్ల ప్రయాణాన్ని చూసి నేను పూర్తిగా సంతృప్తి చెందలేదు. ఇంకా కూడా ఏదో చేయాలన్న తపన ఉంది. కాకపోతే ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను. ఏమవ్వాలో తెలియదు కానీ ఎలా ఉండకూడదో మాత్రం బాగా తెలుసు.

**నేను కమెడియన్ కాదు**

అయితే నన్ను నేను కమెడియన్ అనుకోలేను. ఎందుకంటే సత్య, వెన్నెల కిశోర్‌లా కామెడీ చేయలేను. ఆ విషయం నాకు తెలుసు. నేను కమెడియన్ అవుతానని ఇండస్ట్రీలోకి రాలేదు. కోట శ్రీనివాసరావు, ప్రకాశ్‌రాజ్‌లను చూసి వీళ్లలా యాక్టింగ్ చేయాలనుకువాడిని. ఇన్నేళ్ల కెరీర్‌లో నేను తీసుకున్న మంచి నిర్ణయం కోర్ట్ సినిమా ఒప్పుకోవడమే! మిఠాయి సినిమా చేయడం చెత్త నిర్ణయంగా భావిస్తాను.

**పొరపాట్ల నుంచే నేర్చుకోగలం**

ఎందుకంటే ఈ సినిమాను నేను మనస్ఫూర్తిగా ఒప్పుకోలేదు. అటు దర్శకుడు కూడా పూర్తిగా మనసు పెట్టి తీయలేదు. సినిమాలు ఎలాంటివి చేయాలి? ఎలాంటివి చేయకూడదు? అన్న విషయం నేర్పించింది మిఠాయి సినిమానే.. ఇలాంటి పొరపాట్లు చేయడం వల్ల ఎంతో నేర్చుకోగలం. ఉదాహరణకు గతంలో నేను చాలా సిగరెట్లు తాగేవాడిని. దానివల్ల వచ్చే ఇబ్బందులు తెలుసుకున్నాను కాబట్టే మానేశాను అని ప్రియదర్శి చెప్పుకొచ్చాడు.

**సినిమా**

ప్రియదర్శి.. 2016లో వచ్చిన టెర్రర్ సినిమాతో వెండితెరపై రంగప్రవేశం చేశాడు. తొమ్మిదేళ్ల ప్రయాణంలో 50కు పైగా సినిమాలు చేశాడు. కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హీరోగా తన ప్రయాణం కొనసాగిస్తున్నాడు. పెళ్లిచూపులు, బలగం, మల్లేశం, 35:చిన్న కథ కాదు, మంగళవారం, కోర్ట్ వంటి పలు హిట్ చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యాడు.




# అభిమాన స్టార్ నుంచి గిఫ్ట్ పొందిన మోహన్‌లాల్

తాను ఎంతగానో అభిమానించే వ్యక్తి, ఫుట్‌బాల్ క్రీడాకారుడు, అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి నుంచి ప్రత్యేక కానుక పొందారు మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ మెస్సీ నుంచి అందుకున్న కానుకను చూపిస్తూ ఎక్స్ వేదికగా ఆయన తాజాగా పోస్ట్ పెట్టారు. గిఫ్ట్ ప్యాక్ తెరుస్తున్న క్షణం తన హృదయం ఆనందంతో నిండిందని ఆయన పేర్కొన్నారు. "జీవితంలోని కొన్ని క్షణాలు మాటల్లో చెప్పలేనివిగా అనిపిస్తాయి. అవి జీవితాంతం మనతోనే ఉంటాయి. అలాంటి మధుర క్షణాలనే ఈరోజు నేను ఆస్వాదిస్తున్నా. గిఫ్ట్ బాక్స్ తెరుస్తున్న సమయంలో మెస్సీ సంతకం చేసి ఉన్న జెర్సీ చూసి నా హృదయం ఒక్కసారిగా ఆశ్చర్యంతో నిండిపోయింది. అంతేకాదు, ఆ జెర్సీపై ఆయన స్వయంగా నా పేరు రాసి పంపారు. క్రీడాకారుడిగానే కాకుండా వ్యక్తిగతంగానూ ఆయన్ని ఎంతగానో అభిమానించే నాలాంటి వ్యక్తికి ఇది చాలా ప్రత్యేకమనే చెప్పాలి. నా ఆప్త మిత్రులు రాజీవ్, రాజేశ్ లేకుండా ఇలాంటి అద్భుతమైన క్షణాలను నేను పొందేవాడిని కాదు. కాబట్టి వారిద్దరికీ ధన్యవాదాలు" అని మోహన్‌లాల్ తెలిపారు. ఈ కానుకను తాను జీవితాంతం పదిలపరచుకుంటానని చెప్పారు. సినిమాల విషయానికి వస్తే.. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటించిన 'ఎల్ 2: ఎంపురాన్' గత నెలాఖరులో విడుదలైంది. స్టీఫెన్ గట్టుపల్లి పాత్రలో మోహన్‌లాల్ యాక్టింగ్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆయన 'తుడరుమ్' కోసం వర్క్ చేస్తున్నారు. ఏప్రిల్ 25న ఇది విడుదల కానుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com